PDF Compressor Free Version

Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03 నెల్లూరు, 04.01.2013, శుక్రవారం సంపుటి : 32 సంచిక : 31 పేజీలు : 12, వెల : ₹ 4




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com

## కిరణ్ పాలనలో...

# కాంగ్రెస్‌కు సమాధి



- అస్తవ్యస్థ పాలన
- కట్టుతప్పిన శాంతిభద్రతలు
- ఎటుచూసినా ఆందోళనలు
- పన్నులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలు
- సమస్యలు పట్టని పాలకులు

**వైయస్సార్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఇప్పుడు దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి ఫోటోలు పెట్టుకుంటున్నారు. రేపు అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలయ్యాక వాళ్లు ముఖ్యమంత్రి ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి ఫోటోను కూడా తమ గదుల్లో పెట్టుకుని పూజించవచ్చు.**

ఎందుకంటే వై.యస్. మీద వున్న అభిమానంతో వైకాపాకు ఎన్ని ఓట్లు వస్తాయో, కిరణ్‌కుమార్‌రెడ్డి పాలన పట్ల ప్రజల్లో ప్రబలుతున్న వ్యతిరేకత వల్ల కూడా అంతే ఓట్లు రాబోతున్నాయి. కాబట్టి వైకాపాకు వై.యస్ ఫోటోతో ఎంత మేలు జరగబోతుందో, కిరణ్‌తో కూడా అంతే మేలు జరగబోతుంది. వైకాపాకు ఆయన రాజకీయంగా శత్రువే అయినా, పరోక్షంగా మాత్రం ఒక స్నేహితుడిలా సహకరిస్తున్నాడని చెప్పుకోవచ్చు. అగ్నికి ఆజ్యం పోస్తున్నట్లుగా రాష్ట్రంలో జగన్ ప్రభంజనానికి కిరణ్ వ్యతిరేకత మరింత తోడవుతుంది. వైకాపాకు ఓటుబ్యాంకును అంతకంతకు పెంచుతుంది.

రాష్ట్రంలో 2004లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వమే నడుస్తుంది. దాదాపు 9ఏళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ పాలన చీకటి వెలుగుల రంగేళి అనే అనుకోవచ్చు. మొదటి అయిదేళ్ల వై.యస్ పాలన రాష్ట్ర ప్రజలకు వెలుగునిస్తే, ఆ తర్వాత నాలుగేళ్ల రోశయ్య, కిరణ్‌ల పాలన చీకటిమయంగా మారింది. వై.యస్ హయాంలో ప్రజలకు ఇవ్వడమేగాని, ప్రజల నుండి తీసుకోవడం, పన్నుల రూపంలో వసూలు చేసుకోవడం అన్న కాన్సెప్టే లేదు. ఆయన హయాంలో ప్రజల కోసం ఎన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టాడో వ్రాయాలంటే చాంతాడంత జాబితా అవుతుంది. ఆయన హయాంలో ఏ ఒక్క ఛార్జీ పెరగలేదు. ఎలాంటి పన్నులు పెంచలేదు. ఫీజు రీయంబర్స్‌మెంట్‌కు, పావలా వడ్డీ ఋణాలకు, పింఛన్‌లకు, ఆరోగ్యశ్రీకి వేలకోట్లు ఖర్చు పెట్టాడు. అసలు కరెంట్ ఛార్జీల జోలికే వై.యస్. పోలేదు.

కాని వై.యస్. హయాంలో ప్రజలకిచ్చిన వరాలన్నింటిని కిరణ్ సర్కార్ (మిగతా 5వ పేజీలో)

## ఆనంకు టి.యస్.ఆర్ పరామర్శ



హైదరాబాద్ స్టార్ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న నెల్లూరురూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డిని ఇటీవల కలసి పరామర్శిస్తున్న రాజ్యసభ సభ్యులు తిక్కవరపు సుబ్బరామిరెడ్డి

## షార్ డైరెక్టర్‌గా... మొగల్తూరు మొనగాడు



(వివరాలు 3వ పేజీలో)

# అధికారులదే రాజ్యం

## పనులు జరుగక ప్రజల్లో అయోమయం

**జిల్లాలో అధికార యంత్రాంగం కట్టు తప్పింది. అధికారిక వ్యవస్థలో జవాబు దారీతనం లోపించింది. ప్రజల సమస్యలు వినేవాళ్లు లేరు... వాళ్లకు సమాధానం చెప్పేవాళ్లు కరువు. ఎవరి లోకం వారిదే, ఎవరి దారి వారిదే అన్నట్లుగా పరిస్థితులు ఏర్పడ్డాయి. పనిచేయకుంటే పనిష్మెంట్ వుంటుందనే భయం అధికారుల్లో లేకుండా పోయింది. అంతేకాదు, ఏ అధికారయినా పనివేస్తుంటే, అతనికి పొగబెట్టే కార్యక్రమాలు కూడా ఎక్కువవుతున్నాయి.**

ప్రజాప్రతినిధులు ప్రశ్నించేటట్లుంటే, అధికారులను నిలదీస్తుంటే వాళ్లు క్రమ శిక్షణతో వుంటారు. ప్రజలకు పనులు చేస్తుంటారు. కానీ ఈ జిల్లాలో ప్రజాప్రతినిధులే ఎవరికి వారే యమునాతీరే అన్నట్లుగా వున్నారు. అధికారుల మధ్య విభేదాలు, ఆధిపత్యపోరుల గురించి పత్రికలలోనే రోజూ వార్తలు వస్తున్నాయి. జిల్లా అధికార యంత్రాంగంపై జిల్లా మంత్రిగా ఆనం రామనారాయణరెడ్డికి పట్టు వుండాలి. కాని ఈ జిల్లాలో ముఖ్యంగా నగరంలో మొదటినుండి మంత్రి కంటే కూడా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డికి పట్టు వుండేది. అధికారులు కూడా వివేకా అంటేనే జంకేవాళ్లు. ఆయన ఫోన్‌లు చేస్తే పనులు చకచక అయిపోయేవి. కాని రెండు నెలలుగా వివేకా అనారోగ్యంతో హైదరాబాద్‌లోనే వున్నాడు. ఆయనకు ఫోన్‌లు చేసే అవకాశం కూడా లేదు. ఆయన నుండి ఫోన్‌లు రావనే ధీమా అధికారుల్లో ప్రబలింది. మంత్రి వుంటే నెల్లూరుకు ఎప్పుడు వస్తాడో, ఎప్పుడు వెళ్లిపోతాడో తెలియదు కాబట్టి అధికారులకు సమస్య లేదు. నెల్లూరులో ప్రజలకు మాత్రం పనులు కావడం లేదు. తమ పనులు కోసం అధికారుల చుట్టూ చెప్పులరిగేలా తిరగాల్సి వస్తుంది. జిల్లాలో మిగతా ఎమ్మెల్యేలున్నా ఎవరికీ అధికారులపై పట్టు లేదు. (మిగతా 5వ పేజీలో)



PDF Compressor Free Version





జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న తుంగా శివప్రభాత్‌రెడ్డి, తోట మనోహర్, పి.నారాయణరావు, ఏ.వి.కృష్ణారెడ్డి, యఙ్ఞం హనుమారెడ్డి, డాక్టర్ అజయ్‌కుమార్

## వినడానికి పసందుగా, కమ్మని పాటల విందుగా...

# కళాంజలి అవార్డుల పండుగ

**కళ్యాణ వేదికలలోనూ, జన్మదిన వేదికలపైనా సంగీత, సాంస్కృతిక ఈవెంట్లతో శుభసందడికి, వచ్చిన అతిథులను అలరిస్తూ నిత్యం పలు కళాసంబరాలతో నెల్లూరు కళాప్రియులను ఆకట్టుకుంటున్న "కళాంజలి" సంస్థ 24వ వార్షికోత్సవ సందర్భంగా వివిధ రంగాలలో నిష్ణాతులైన వారికి ప్రతిభాపురస్కారాలను అందజేసింది.**








డిసెంబర్ 29వ తేదీ సాయంత్రం 2012కి వీడ్కోలు పలుకుతూ జరిగిన ఈ కార్యక్రమంలో సాహిత్య రంగం నుండి "బీద రమణయ్య స్మారక" పురస్కారాన్ని ప్రముఖ జర్నలిస్టు, రచయిత మహమ్మద్ ఖదీర్‌బాబుకి అందజేయగా, క్రీడా రంగం నుండి మాజీ ఫుట్‌బాల్ క్రీడాకారుడు వీరిశెట్టి వెంకట కృష్ణమూర్తి, నాటక రంగం నుండి రంగస్థల, టి.వి.నటుడు దువ్వూరు బెనర్జీ, సంగీత రంగం నుండి ప్రముఖ వీణా విద్వాంసురాలు శ్రీమతి పి. హేమలక్ష్మిలు "కళాంజలి" పురస్కారాలు అందుకున్నారు.

కార్యక్రమం ఆద్యంతం పాతచిత్రాల గానలహరితో వీనులవిందుగా జరిగింది. చిన్నారులు సాయిదేవహర్ష, నాదప్రియ, శ్రేయ, శ్రీకళ, అనూష, రాజలక్ష్మిలు గానం చేసిన ఆపాత మధురాలు సంగీతప్రియుల హృదయాలను దోచుకున్నాయి. పిట్టకొంచెం కూత ఘనం అన్నట్లుగా చిన్నారులందరూ తమ వయసుకు మించిన ప్రతిభను చూపించి ప్రశంసలందుకున్నారు.

కావలి శాసనసభ్యుడు బీద మస్తాన్‌రావు కార్యక్రమంలో మాట్లాడుతూ కావలి నియోజకవర్గంలో జన్మించిన అసమాన ప్రతిభాశాలి, జాతీయస్థాయిలో కథలు, రచనల ద్వారా ప్రసిద్ధిగాంచిన మహమ్మద్ ఖదీర్‌బాబుకి తన తండ్రి పేర అవార్డు అందజేయడం ఎంతో సంతృప్తినిస్తుందని అన్నారు. చదువుకునే వారన్నా, సాహితీవేత్తలూ సాహితీ ప్రియులన్నా తన తండ్రికి ఎంతో ఇష్టమని, తెలుగు వారంతా ప్రపంచ తెలుగుమహాసభలు జరుపుకుంటున్న ఈ తరుణంలో ఖదీర్‌కు ఈ అవార్డు ఇవ్వడం ఎంతో సముచితంగా భావిస్తున్నానన్నారు. కార్యక్రమాన్ని రంజింపజేసిన చిన్నారులకు, వాయిద్య కళాకారులకు చిరుసత్కారంగా 25వేల రూపాయల బహుమానాన్ని ఆయన ప్రకటించారు.

క్రీడారంగం నుండి వీరిశెట్టి వెంకట కృష్ణమూర్తిని సన్మానించిన ఏ.సి.సుబ్బారెడ్డి మెమోరియల్ రీడింగ్ సెంటర్ కార్యదర్శి తోట మనోహర్, సింహపురి స్పోర్ట్స్ ఫౌండేషన్ ఫౌండర్ అండ్ ఛైర్మెన్ ముక్కాల ద్వారకానాథ్ తమ ప్రసంగంలో కేవలం కళలకే కాకుండా క్రీడలకు కూడా పెద్దపీట వేస్తున్న "కళాంజలి" సారధి అనంత్‌ని అభినందించారు.

సంగీత రంగం నుండి అవార్డు అందుకున్న శ్రీమతి పి. హేమలక్ష్మిని సత్కరించిన సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయ ఛైర్మెన్ ఇసనాక హర్షవర్ధన్‌రెడ్డి, సర్వేపల్లి మ్యూజిక్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ దంపతులు కళాంజలి చేస్తున్న "కళాసేవ"ని సంస్థ నిర్వాహకుడు అనంత్‌ని కొనియాడారు.

కావలి శాసనసభ్యులు బీద మస్తాన్ రావు, 'లాయర్' వారపత్రిక సంగ్రాహకుడు ప్రభుల చేతులమీదుగా నాటకరంగ అవార్డును అందుకున్న బెనర్జీ స్పందిస్తూ ఈ అవార్డు ప్రభుత్వం ఇచ్చే అకాడమీ అవార్డు కన్నా గొప్పదని, పలుకుబడే పెట్టుబడిగా వచ్చే ఆ అవార్డుకన్నా కష్టాన్ని గుర్తించి ఇచ్చే ఇలాంటి అవార్డులే కళాకారుడికి తృప్తి నిస్తాయని అన్నాడు.

ఘోర సంఘటనలో అశువులు బాసిన ఢిల్లీ యువతికి యావత్ భారతజాతి నివాళులర్పిస్తున్న ఈ తరుణంలో తాను ఈ అవార్డు అందుకోవడం బాధగా వున్నా, భవిష్యత్‌లో సమాజానికి అవసరమైన అన్ని రంగాలలో సందేశమిచ్చే స్థాయిలో తన రచనలకి ప్రాధాన్యతనిస్తానని ఖదీర్‌బాబు తన ప్రతిస్పందనలో తెలియజేశాడు.

'లాయర్' ప్రభు, తోట మనోహర్, యఙ్ఞం హనుమారెడ్డి, సర్వేపల్లి అజయ్ కుమార్, ఆనం వెంకటకృష్ణారెడ్డిల జ్యోతి ప్రజ్వలనతో ఎలాంటి సభలూ, ఉపన్యాసాలకు ఎక్కువ తావులేకుండా సంగీతమే ప్రధానంగా మొదలైన ఈ కార్యక్రమం 2012 ఆఖరులో జరిగిన మధురస్మృతిగా ఆద్యంతం ఆనంద భరితంగా సాగింది. అనంత్‌కి అండగా వ్యాఖ్యానాన్ని అందిస్తూ శ్రీమతి వై.శైలజ, అరుణకుమార్, పాటలను సంగీతాన్ని సమన్వయపరుస్తూ బిల్లి శ్యాంసన్, ఎస్.కృష్ణకుమార్, శర్మలతో పాటు శాంతి అందించిన వాయిద్య సహకారం, చిన్ని నారాయణరావు స్వాగత వచనం, అవార్డు గ్రహీతల గురించి సభకు తెలియజేసిన డా॥ యం.సుబ్రహ్మణ్యం పరిచయవాక్యాలు ఎక్కడా ఆటంకం లేకుండా ఆలస్యం కాకుండా చకచకా కార్యక్రమాన్ని ముందుకు నడిపించాయి. మంచిబృందం వుంటే కార్యక్రమం అందంగా వుంటుందనడానికి చక్కని ఉదాహరణ ఈ కళాంజలి అవార్డుల పండుగ.



బీద రమణయ్య స్మారకసాహితీ అవార్డును స్వీకరిస్తున్న ఖదీర్‌బాబు



కళాంజలి అవార్డ్స్‌ను అందుకున్న వీరిశెట్టి వెంకటకృష్ణమూర్తి, పి.హేమలక్ష్మి, బెనర్జీ

## దేశంలో చాలామందికి కాలేయాలు కావాలి...!

**వినడానికి విడ్డూరంగా వుంది కదూ...! అవును మీరు చదివింది నిజమే. మన దేశంలో కాలేయ(లివర్) వ్యాధితో బాధపడుతున్న రోగుల సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతోంది. సంవత్సరానికి 20వేల నుండి 25వేల వరకూ కాలేయ మార్పిడి చికిత్సలు మన దేశంలో జరగవలసి వుంటే కేవలం 700 నుండి 800మందికి మాత్రమే ఈ చికిత్స జరుగుతోంది. మిగిలిన వారిలో ఎక్కువశాతం తక్కువ కాలం తమ జీవనాన్ని సాగించి సారించవలసి వస్తోంది.**

ఈ మాటలన్నది ఎవరోకాదు... మన రాష్ట్రంలోని హైదరాబాదులో సంవత్సరానికి సుమారుగా 200మందికి కాలేయ మార్పిడి చేస్తున్న గ్లోబల్ ఆసుపత్రికి చెందిన శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ మహమ్మద్‌రేలా, ఆసుపత్రి ఛైర్మెన్ మరియు మేనేజింగ్ డైరక్టర్ డాక్టర్ కంచర్ల రవీంద్రనాథ్‌లు చెప్పిన అక్షర సత్యాలివి. తమ పరిధిలో వున్న అన్ని గ్లోబల్ ఆసుపత్రులతో కలిపి 200వ కాలేయమార్పిడి చికిత్సను ఇటీవలే పూర్తిచేసిన సందర్భంగా వారు చెప్పిన మాటలివి.

అంతర్జాతీయ ఆసుపత్రులతో సమానంగా పోల్చిచూస్తే తమ సారధ్యంలో నడుస్తున్న గ్లోబల్ ఆసుపత్రిలో 90శాతం మందికి ఈ కాలేయ మార్పిడి ఆపరేషన్లను విజయవంతంగా పూర్తి చేశామని చెప్పారు. తమ హైదరాబాద్ బ్రాంచ్ ద్వారా కాలేయ మార్పిడిలో అంతర్జాతీయంగా వున్న ప్రముఖ హాస్పిటల్స్ సరసన హైదరాబాదును చేర్చామని గర్వంగా చెప్పారు.

వీరు చెప్పిన మాటలు గమనిస్తే "కాలేయ మార్పిడి" అవసరమయ్యే వారి శాతం రోజురోజుకీ పెరిగిపోతోందని ఖచ్చితంగా మనకి అర్థమైపోతోంది. వాతావరణ కాలుష్యం, మారుతున్న ఆహారపు అలవాట్లు, మద్యపాన సేవనం, కలుషితమైన నీరు వంటి అనేక కారణాలు కాలేయం పాడు కావడానికి మూలం అంటున్నారు వైద్యనిపుణులు. ముఖ్యంగా హెపటైటిస్-బి అనే వైరస్ ఎక్కువ మందిని పట్టి పీడించడమే కాలేయ మార్పిడి స్థితికి మనిషిని తీసుకువెళ్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు డాక్టర్లు.

భారతదేశంలోనే తొలిసారిగా కాలేయ మార్పిడి శస్త్రచికిత్సను నిర్వహించిన గ్లోబల్ హాస్పిటల్స్ తరువాత కాలంలో ఈ సంఖ్యను 200కి చేర్చారు. అమెరికా వంటి దేశంలో కాలేయమార్పిడికి దాదాపు 2కోట్ల రూపాయలు ఖర్చవుతుండగా, యునైటెడ్ కింగ్‌డమ్(లండన్)లో కోటి రూపాయలవుతుంది. సింగపూర్‌లో సుమారు 80లక్షల రూపాయలు అవుతుండగా మన దేశంలో గ్లోబల్ హాస్పిటల్స్ ఈ శస్త్రచికిత్సను కేవలం 20 నుండి 25లక్షల రూపాయలకే చేస్తున్నారు. ప్రపంచ వైద్యరంగ పటంలో ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్‌లోని గ్లోబల్ ఆసుపత్రిని చేర్చడంలో డాక్టర్ మహమ్మద్ రేలా ప్రతిభానైపుణ్యమే కారణమని డా॥ రవీంద్రనాథ్ అంటున్నారు.

అవసరమైన వేళలో అందుబాటు రేట్లతో సామాన్యుడికి సైతం చేరువగా తమ సేవలందిస్తున్న గ్లోబల్‌ను అభినందించాల్సిందే. ఎక్కడంటే అక్కడ మంచినీళ్లు త్రాగేవాళ్లు, అతిగా మద్యపానం సేవించే వాళ్లు కొంచెం జాగ్రత్త పడితే కాలేయానికి క్షేమం.

## కోటి సంతకాలకు పోటెత్తారు!

కోటంరెడ్డి



వైయస్సార్ అధినేత జగనన్న విడుదల కోసం చేపట్టిన కోటి సంతకాల సేకరణకు నెల్లూరురూరల్ నియోజకవర్గంలో విశేష స్పందన లభించిందని ఆ పార్టీ నాయకుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నాడు. బుధవారం నెల్లూరులోని రాజన్నభవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్‌పై ప్రజాభిమానానికి కోటి సంతకాల సేకరణ అద్దం పడుతుందన్నాడు. ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి జగన్ విడుదల కోసం సంతకాలు చేస్తున్నారన్నాడు. రూరల్ నియోజకవర్గంలో 56ప్రాంతాలలో శిబిరాలను ఏర్పాటు చేసామని, ఐదు ప్రచార రథాల ద్వారా ప్రజలకు విషయాన్ని చేరవేసామని 72వేల సంతకాలను సేకరించడం జరిగిందన్నాడు. నియోజకవర్గపరిధిలో 19డివిజన్లు, 41గ్రామాలలో స్థానిక నాయకుల ద్వారా సంతకాలను సేకరించడం జరిగిందన్నాడు. వై.యస్.జగన్‌పై సిబిఐ కక్షసాధింపు ధోరణిని నిరసిస్తూ రాష్ట్రపతికి సంతకాల జాబితాను అందజేయనున్నట్లు శ్రీధర్ తెలిపాడు. జగన్ ప్రజా ప్రభంజనంలో కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు కొట్టుకుపోయే కాలం ఆసన్నమైందని జోస్యం చెప్పాడు.

ఈ సమావేశంలో వైకాపా నేతలు చింతం జనార్థన్‌రెడ్డి, పిగిలాం నరేష్‌యాదవ్, కె.వి.రాఘవరెడ్డి, తోట వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

PDF Compressor Free Version



# రాజు లేని రాజ్యంలా నెల్లూరు!

దాదాపు 20ఏళ్లుగా నెల్లూరు నగరంతో ఆనం వివేకానందరెడ్డి జీవితం ముడివేసుకుపోయింది. వారం పదిరోజులకు మించి ఆయన నెల్లూరుకు దూరమైన సందర్భాలు చాలా తక్కువ. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నా కూడా ఆదివారం అయ్యిందంటే వచ్చి నెల్లూరులో వాలేవాడు.

ఆయన నెల్లూరులో వుంటేనే ఎంతో సందడిగా వుండేది. రాజకీయంగా ప్రత్యర్థులను తిట్టడం, వాళ్లచేత తిట్టించుకోవడంలో కూడా ఆయన దిట్ట. ఆయన ఫోటో లేకుండా, ఆయనకు సంబంధించిన వార్త లేకుండా పత్రికలు వచ్చేవి కావు. నెల్లూరు నగరంలో పెద్దపెద్ద షాపింగ్‌మాల్స్ మొదలుకొని బార్బర్‌షాపుల వరకు ఆయన చేతులమీదుగానే ప్రారంభోత్సవాలు జరిగేవి.


కాని రెండు నెలలుగా అనారోగ్య కారణాలతో ఆయన హైదరాబాద్‌కే పరిమితం కావడంతో నెల్లూరు రాజు లేని రాజ్యంగా బోసిపోయివుంది. ఎటువంటి రాజకీయ సందడి లేదు. రాజకీయ విమర్శలు లేవు. పత్రికలకు సంచలనాత్మక వార్తలు లేవు. నగరంలో పరిపాలన సైతం అస్తవ్యస్థంగా వుంది. జనం ఏదన్నా సమస్య చెప్పుకుందామన్నా ఎవరికి చెప్పుకోవాలనేదే పెద్ద ప్రశ్నగా వుంది.

వివేకాకు రొట్టెలపండుగ, కార్తీకమాసం, క్రిస్మస్, ముక్కోటి వేడుకలంటే చాలా ఇష్టం. ఆయన ఇక్కడ లేకుండానే రొట్టెల పండుగ జరిగింది. ఆయనలేని లోటు బాగానే కనిపించింది. కార్తీకమాసం అలాగే వెళ్లిపోయింది. క్రిస్మస్ వేడుకలు సైతం ఆయన లేకుండానే జరిగిపోయాయి. ముక్కోటి ఏకాదశి రోజున రంగనాథస్వామి ఆలయంలో ఆయన లేని వెలితి స్పష్టంగా కనిపించింది. రాజకీయాలలో మంచి చెడులను పక్కనపెడితే నెల్లూరులో వివేకా కనిపించని లోటు బాగా వుంది. త్వరలో ఆయన కోలుకుని నెల్లూరులో తిరగాలని జనాభిలాష.

ఆనం వివేకానందరెడ్డి... "నిండు చంద్రుడు ఓ వైపు... చుక్కలు ఓ వైపు.." అన్నట్లుండే నాయకుడు. రాష్ట్ర శాసనసభలో 294మంది ఎమ్మెల్యేలుంటే 293మందిని ఓ పక్కనపెట్టి, వివేకాని ఇంకోపక్క పెట్టొచ్చు. ఆయనది అంతటి డిఫెరంట్ క్యారెక్టర్.



## మొగల్తూరు మొనగాడు..
# షార్ డైరక్టరయ్యాడు



ప్రతి వ్యక్తి జీవితచరిత్రలోనూ గర్వించే క్షణాలు కొన్ని వుంటాయి. ఆ క్షణాలనేవి మన కోసం మనం బ్రతికినప్పుడు రావు... మన చుట్టూ వున్న నలుగురి కోసం బ్రతికినప్పుడు, మనం వున్న సమాజం కోసం పనిచేసినప్పుడు, మనల్ని కన్న దేశానికి సేవ చేసినప్పుడు... అవిగో అలాంటి ఆనందకరమైన గర్వించదగ్గ క్షణాలే యలపాక యజ్ఞేశ్వర సత్యనారాయణ ప్రసాద్ జీవితంలో ఆవిష్కృతమయ్యాయి.

అంతరిక్ష ప్రయోగాలలో అంతర్జాతీయంగా కీర్తిపొంది, భారతదేశానికే తలమానికంగా నిలుస్తున్న శ్రీహరికోటలోని షార్‌సెంటర్‌కు ఎంవైఎస్ ప్రసాద్ డైరక్టర్‌గా ఎన్నికయ్యారు. షార్ డైరక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన వారిలో ఆయన రెండో తెలుగువాడు. 2001-05ల మధ్య మన నెల్లూరుజిల్లా సూళ్లూరుపేటకే చెందిన కె.నారాయణ షార్ డైరక్టర్‌గా పనిచేసి వున్నారు.

పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు అంటే ఇంతకుముందు మెగాస్టార్ చిరంజీవి గుర్తుకువచ్చేవాళ్లు. ఇప్పుడు మన ప్రసాద్ కూడా గుర్తుకు వస్తాడు. ఎందుకంటే ఆయనది కూడా ఆ ఊరే! ప్రసాద్ 1975లో ఇస్రోలో ఇంజనీర్‌గా చేసారు. 1975-94ల మధ్య నిర్వహించిన 8అంతరిక్ష ప్రయోగాలలో ట్రాకింగ్, కమాండ్ వ్యవస్థలకు ఆయన నిర్వాణ సారథ్యం వహించారు. షార్ నుండి వదిలే ప్రతి రాకెట్ ప్రయోగంలోనూ ఆయన కీలకపాత్ర పోషించేవారు. చంద్రయాన్-1లో కూడా ఆయన తనదైన పాత్ర పోషించారు. భారత జాతి గర్వించే షార్ సెంటర్‌కు ఓ తెలుగు జాతీయుడు డైరక్టర్ కావడం ఆనందకరం... అభినందనీయం.

# జగన్ గాలిపైనే ఆధారం

## పార్టీకి శిరోభారంగా మేకపాటి వ్యవహారం




'కుండలో కూడు కుండలోనే వుండాలి... పిల్లాడు మాత్రం బొద్దుగా వుండాలి'.. ఇలా వుంది వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో మేకపాటి సోదరుల వ్యవహారం. జేబులో నుండి రూపాయి ఖర్చు కాకూడదు... ఓట్లు రావాలి, సీట్లు కావాలి... వీటన్నింటికి జగన్‌గాలే ఆధారం. జగన్ గాలి వుంది కాబట్టి జనాలు గుడ్డిగా వచ్చి ఓట్లేసిపోతారని వాళ్లు భావిస్తున్నారు. పార్టీలో వాళ్లు అనుసరిస్తున్న ఒంటెద్దుపోకడలు మిగతా నాయకులకు శిరోభారంగా మారుతున్నాయి.

జగన్ గాలి వుందనేది వాస్తవమే... అదెక్కడ పనిచేస్తుంది. ప్రతిఒక్కరూ ఓటింగ్‌లో పాల్గొనే అసెంబ్లీ, లోక్‌సభ, స్థానిక సంస్థలు వంటి ఎన్నికలలో పనిచేస్తుంది. పార్టీ గుర్తులు లేకుండా స్థానిక నాయకత్వాల ఆధారంగా జరిగే సహకార ఎన్నికలలో కూడా జగన్‌గాలి పనిచేస్తుందనుకోవడం అమాయకత్వమే అవుతుంది.

జగన్ గాలి వుంది... జనం గుడ్డిగా వచ్చి ఓట్లేసిపోతారనే... పిచ్చి నమ్మకంతో మేకపాటి సోదరులు సహకార ఎన్నికలను సీరియస్‌గా తీసుకోనట్లు కనపడుతుంది. సహకార ఎన్నికల నేపథ్యంలో ఓట్ల చేర్పులో వైకాపా శ్రేణులు బాగా వెనుకబడ్డాయని తెలుస్తుంది. దీనికి కారణం నియోజకవర్గాల వారీగా ఎవరికి వారికి బాధ్యతలు అప్పగించకపోవడం, అన్ని నియోజకవర్గాలలోనూ మేకపాటి సోదరులు వేలు పెట్టి వుండడం. ఒక్కో ఓటుకు 330రూపాయలు కట్టి చేర్పించాలి. కాంగ్రెస్, తెలుగుదేశం వాళ్లు మాత్రం నాయకులే ఆ ఖర్చులు భరించి ఓట్లు చేర్పించారు. కాని వైకాపా వద్దకు వచ్చే సరికి ఖర్చు ఎవరు భరించాలనే ప్రశ్న వచ్చింది. స్వతహాగా అందరూ మేకపాటి వైపే చూస్తారు. కాని వాళ్లు మాత్రం జగన్‌గాలి వుంది... ఓట్లు మనకే వస్తాయి... ఎక్కువ సొసైటీలు మనవే... సెంట్రల్ బ్యాంకు పీఠం మనదే అనే ధీమాతో వున్నట్లు తెలుస్తుంది. మొత్తం 99సొసైటీలకుగాను 70సొసైటీలు దాకా మనకే వస్తాయని భజనపరులు చెబుతుంటే ఎంపీ మేకపాటి గాల్లో తేలుతున్నాడని సమాచారం. కాని పాతిక సొసైటీలు కూడా రావడం కష్టమేనని, ఆ విధంగా నెట్‌వర్క్ చేసుకోవడంలో విఫలమయ్యామని వైకాపాలోనే మరోవర్గం బాధపడుతుంది.

# రక్షిస్తారా? శిక్షిస్తారా?

**● మూడుశాఖల సమిష్టి కృషితోనైనా రెడ్‌గోల్డ్ అక్రమరవాణాకు కళ్లెం పడేనా?**



మన ప్రభుత్వాల చర్యలు ఎలావుంటాయంటే... జనాన్ని పీక్కుతినే రాబందులను వదిలేసి, పురుగు, పుట్ర తిని బ్రతికే కాకులను కొట్టేలా వుంటాయి. విలువైన ప్రభుత్వ సంపదను స్మగ్లర్లు దోచుకుపోతున్నా దానిని అడ్డుకోలేరు. అక్రమార్కులు జాతిసంపదను తెగ దోచేస్తూ విదేశాలకు పంపిస్తుంటారు. ఎర్రచందనంనే ఉదాహరణగా తీసుకుందాం. రోజుకు కోట్ల రూపాయల విలువచేసే ఎర్రచందనం విదేశాలకు తరలుతూనే వుంది. స్మగ్లర్లు కోట్లకు పడగలెత్తుతూనే వున్నారు. కాని మన ప్రభుత్వానికి అవి పట్టవు. జనం మీదే వీళ్ల కన్ను...జనాన్ని పిండేసి దండుకోవడంపైనే శ్రద్ధ. అందుకే 'సర్‌ఛార్జ్'లు, ఇతర పన్నుల పేరుతో జనాన్ని వేపుకు తింటుంటారు.

ఎర్రచందనం ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో వుంది. కాబట్టి అక్రమ రవాణా కూడా అదే స్థాయిలో వుంది. ఎర్రచందనం అక్రమ రవాణాను నివారించడానికి ఇంతకాలం ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టలేదనే చెప్పవచ్చు. ఇప్పటివరకు కేవలం దానిని అటవీశాఖ బాధ్యతగా మాత్రమే చూస్తూ వచ్చారు. ఇటీవల ఎర్రచందనం అక్రమ రవాణాపై మీడియాలో భారీగా కథనాలు వచ్చాయి. సీఎం సొంతజిల్లా చిత్తూరు కేంద్రంగా పెద్దఎత్తున ఎర్రచందనం అక్రమరవాణా జరుగుతుంది. అటవీశాఖ సిబ్బందిపై సైతం స్మగ్లర్లు దాడులకు తెగబడుతున్నారు. ఈ పరిస్థితులను గుర్తించిన ముఖ్యమంత్రి అక్రమరవాణాను అడ్డుకోవడానికి తగినచర్యలకు శ్రీకారం చుట్టారు. రెవెన్యూ, పోలీస్, అటవీశాఖ అధికారులు ఇకనుండి సమన్వయంతో పనిచేస్తూ ఎర్రచందనం అక్రమ రవాణాకు కళ్లెం వేస్తారు. మండలస్థాయిలో కూడా ఎమ్మార్వో, ఎస్‌ఐ, రేంజర్‌లు కలిసి పనిచేస్తారు. జిల్లాలో వున్న స్మగ్లర్ల జాబితాను కూడా రూపొందిస్తున్నారు. స్మగ్లర్లతో పాటు వారికి సహకరిస్తున్న వారిపై కూడా అధికారులు నిఘా వేస్తున్నారు. స్మగ్లింగ్‌ను ఆపేసిన వాళ్లను వదిలేసి, ఇంకా స్మగ్లింగ్‌నే వృత్తిగా పెట్టుకున్నవారిపై కన్నేస్తున్నారు.

# మందులో మునుగుతున్నారు!



జిల్లాలో ఏ వ్యాపారం సవ్యంగా లేదు... ప్రతి వ్యాపారంలోనూ ఒడిదుడుకులున్నాయి. ఏ వ్యాపారిని కదిలించినా నీరసంగానే మాట్లాడుతున్నాడు. ఏ వ్యాపారం ఎంతగా దివాళాతీస్తున్నా, ఇంట్లో తినడానికి గింజలు లేక చాలామంది పస్తులుంటున్నా మద్యం తాగేవాళ్లు మాత్రం తగ్గడంలేదు. వారు తాగే మోతాదు కూడా ఏ మాత్రం తగ్గడం లేదు.

జిల్లాలో కేవలం ఐదునెలల్లోనే 366కోట్ల రూపాయలకు మద్యం అమ్మకాలు జరిగాయి. ఇవి కూడా జూలై నుండి నవంబర్ వరకు, డిసెంబర్‌ను కలిపితే న్యూఇయర్ అమ్మకాలు భారీగానే వుంటాయి కాబట్టి ఆదాయం గణనీయంగానే పెరిగివుంటుంది. సరాసరిన నెలకు 73కోట్ల మద్యాన్ని జనం తాగేస్తున్నారు. గత ఏడాది ఇదేకాలానికి మద్యం అమ్మకాలు 301కోట్లు వుండగా ఈసారి ఏకంగా 66కోట్లు పెరగడం విశేషం. ముఖ్యంగా తాగుబోతులు పెరుగుతున్నారు. యువత, కళాశాలలో చదివే విద్యార్థులు తాగుడును ఒక ఫ్యాషన్‌గా భావిస్తున్నారు. రాత్రయితే పలు దాబాలు, బార్లలో విద్యార్థులే ఎక్కువగా కనిపిస్తున్నారు. ఈ తాగుడుకు అలవాటుపడిన విద్యార్థులు కొందరు డబ్బుల కోసం నగరంలో చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడిన సంఘటనలున్నాయి. విద్యార్థులు ఎక్కువగా తాగుబోతులవుతుండబట్టే జిల్లాలో బీర్ల అమ్మకాలు విపరీతంగా పెరిగాయి. ఇదే మద్యం అమ్మకాల జోరు 2013లోనూ కొనసాగితే బాగుంటుందని మద్యం వ్యాపారులు ఆశపడుతున్నారు.

○ కొత్త ఏడాదిపై కోటి ఆశలు


# భారంగా గడిచిపోయిన 2012

లోకం కొత్త సంవత్సరానికి స్వాగతం పలికింది. 2012కు వీడ్కోలు పలికింది. సెంటిమెంట్ పరంగా కాకపోయినా 2012 సంవత్సరం భారంగానే గడిచిపోయింది. జిల్లాకు సంబంధించినంతవరకు 2012లో పెద్దగా జరిగిన అభివృద్ధి అంటూ ఏదీ లేదు. అన్ని రంగాలలో వైఫల్యాలనే చవిచూడాల్సి వచ్చింది. గత ఏడాది కురిసిన వర్షాలు అంతంత మాత్రమే, చెరువులు, బావుల్లో కూడా నీళ్లు లేకుండా పోయాయి. తగిన వర్షపాతం లేక పొలాలను బీడు పెట్టుకోవాల్సి వచ్చింది. రైతాంగానికి గత ఏడాది పెద్దగా ఒరిగిందేమీ లేదు.

అన్నింటిలోకెల్లా రియల్ ఎస్టేట్ బాగా దెబ్బతింది. రియల్టర్లు అప్పులపాలయ్యారు. జిల్లాలో ఏ ఒక్క రియల్టర్ కూడా ఆర్థికంగా లాభపడ్డ దాఖలాలు లేవు. స్థలాలు, పొలాల ధరలు పెరగడం మాని తగ్గుముఖం పట్టాయి. అధికవడ్డీలకు అప్పులుతెచ్చి రియల్ ఎస్టేట్‌లోకి దిగిన రియల్టర్లు చివరికి నెత్తిమీద గుడ్డేసుకోవాల్సి వచ్చింది. రియల్‌ఎస్టేట్ రంగం బాగా దెబ్బతినడంతో దాని ప్రభావం ఇతర రంగాలమీద కూడా పడింది. రిజిస్ట్రేషన్‌శాఖకు ఆదాయం గణనీయంగా తగ్గిపోయింది. రియల్‌ఎస్టేట్ ఆధారిత వ్యాపారాలలోనూ టర్నోవర్ తగ్గిపోయింది. 2012లో పూర్తిగా దెబ్బతిన్న రియల్‌ఎస్టేట్ వ్యాపారం 2013లోనన్నా కోలుకుంటుందేమోనని రియల్టర్లు కోటి ఆశలతో కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలికారు.

PDF Compressor Free Version






## కిరణ్ అభినందనీయుడు

రాష్ట్రంలోని దళిత సామాజిక, రాజకీయ అభివృద్ధికి ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ రూపొందించి, మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించి దీనిని అసెంబ్లీలో ఆమోదింపజేసిన సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి అభినందనీయుడు. దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో ఈ సబ్‌ప్లాన్‌ను అమలు చేసారు. దళితుల అభ్యున్నతి కోసం మిగతా రాష్ట్రాలు కూడా ఈ సబ్‌ప్లాన్‌ను అమలు చేయాలి.

ఎస్.బాబూరావు, కావలి.

## ప్రైవేట్ తెలుగు సభలు

మన జిల్లాలో తెలుగుసభలు పాక్షికంగా జరిగాయి. జిల్లా ఉన్నతాధికారులు ప్రైవేట్ వ్యక్తులకు వేదికను అప్పగించారు. ఆ ప్రైవేట్ వ్యక్తులు తమ సొంత మనుషులకు ప్రాధాన్యత కల్పించారు. సిఫార్సు వున్న వ్యక్తులను వేదికనెక్కించి తెలుగు ప్రతిభావంతులను క్రింద కూర్చోబెట్టారు.

వాస్తు రామచంద్ర, నెల్లూరు.

## జీవితాంతం కుమిలిపోవాలి

ఢిల్లీ గ్యాంగ్‌రేప్, హత్య బాధితులకు ఉరిశిక్ష విధించడం సరైంది కాదు... ఉరితీస్తే ఒక నిముషంలో ప్రాణం పోతుంది. బ్రతికినంతకాలం ప్రతిక్షణం చచ్చేలా వారికి శిక్ష వుండాలి. నిందితులను జీవితాంతం చీకటి జైలులో పెట్టి వాళ్లని సంసారానికి పనికి రాకుండా చేయాలి.

సి.జ్యోతి, నెల్లూరు.

## పోలీసులే మందుకొడ్తే ఎలా?

నెల్లూరు నగరంలో పోలీసు వ్యవస్థ నిర్వీర్యమౌతోంది. అసలు పోలీసులు వున్నారా? లేరా? అనే అనుమానం వస్తోంది. పనిచేసే పోలీసులు కూడా ఇప్పటి పరిస్థితులు చూసి మనం మాత్రం ఎందుకు పనిచేయాలిలే అన్న మీమాంసలో పడుతున్నారు. రాత్రి గస్తీల విషయంలో అయితే సరేసరి! పోలీసులే మందు కొట్టి జీపులేసుకుని తిరుగుతున్నారు. అల్లరి మూకలను పట్టించుకోవడం మానేసి రోడ్లపై బండ్లు పెట్టుకుని జీవనం గడిపే వారిపై తమ పెత్తనాన్ని చెలాయిస్తున్నారు. పోలీసులే మందుకొట్టి వారిపై వీరంగం చేస్తే వారు ఇంకెవరికి చెప్పుకుంటారు.

జె.ఎస్.కె, నెల్లూరు.

## 'ప్రభా'తం

ఆమె కన్ను మూసింది... ఈ నిరంకుశ సమాజాన్ని ఇక చూడలేనంటూ... ఆమె శాశ్వతంగా వెళ్లిపోయింది... కామమృగాలు తిరిగే ఈ జనారణ్యంలో వుండలేనంటూ... ఈ లోకాన్ని విడిచి వెళ్తూవెళ్తూ... మన సమాజానికి సమాధానంలేని ప్రశ్నలను ఎన్నో సంధించింది. ఈ దేశంలో ఆడబిడ్డగా పుట్టడం పాపమా? ఆడది ఒంటరిగా తిరగడం నేరమా? అవనిలో సగం, ఆకాశంలో సగం అనే మహిళకు వేధింపులే బహుమానమా? అత్యాచారాలతో అనునిత్యం అవమానమా? దేశంలో ఆడబిడ్డలపై ఇంకా ఎన్నెళ్లీ అత్యాచారాలు? ఎంత కాలమని ఈ వేధింపులు? ఆమె ఆత్మ సంధించిన ఈ ప్రశ్నలకు మన ప్రభుత్వాల వద్ద ఈరోజే కాదు రేపు కూడా సమాధానాలు వుండవు.

దాదాపు 13రోజుల పాటు మృత్యువుతో పోరాడిన ఢిల్లీ గ్యాంగ్‌రేప్ బాధితురాలు ఎట్టకేలకు ఆ పోరాటంలో ఓడిపోయింది. బస్సులో ఆరు క్రూరమృగాలు ఆమె పట్ల కనికరం చూపలేదు. కర్కశంగా ప్రవర్తించాయి. ఆమె మానాన్ని దోచుకుని, ఆమె ప్రాణంతో ఆడుకున్నాయి. మానవమృగాలే కాదు, మృత్యువు కూడా ఆమెను కనికరించలేదు. ఈ పాడు లోకంలో నువ్వెందుకులే తల్లీ... అంటూ మృత్యుదేవత తన వెంట తీసుకెళ్లిపోయింది. సింగపూర్ ఆసుపత్రిలో ఆమె కనుమూయగా, ఆదివారం ఆమె అంత్యక్రియలతో భారత దేశం 2012 సంవత్సర ప్రయాణాన్ని ముగించింది. ఈ సంఘటన దేశంలో ప్రతి ఒక్కరి గుండెను పిండేసింది. కంటతడి పెట్టని మనిషంటూ లేడు. దేశచరిత్రలో ఎన్నో అత్యాచారాలు జరిగినా జాతిని తట్టి లేపిన అత్యంత ఘోరసంఘటన ఇది.



### కళ్లు తెరుస్తారా?

స్త్రీని దేవతగా భావించి పూజించే దేశంలో ఒక్క 2011 సంవత్సరంలోనే నమోదైన నేరాలు 2,28,650. రాష్ట్రాల వారీగా చూస్తే మహిళలపై నేరాల జాబితాలు పశ్చిమబెంగాల్, ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలు అగ్రస్థానంలో వున్నాయి.

ఈ ఘటనపై నిరసనలు మిన్నంటాయి. ఆందోళనకారులు స్వచ్ఛందంగా వచ్చి ఉద్యమించారు. ప్రముఖులు, పౌరులు అంతా ఆ యువతి మృతికి కన్నీటి నివాళు లర్పించారు.

ప్రపంచంలోని ఇతర దేశాలు సైతం ఈ సంఘటన పట్ల తీవ్రంగా స్పందించాయి. సింగపూర్ అయితే తమ దేశంలో మరణశిక్షను రద్దు చేయాలంటున్న వారికి ఈ సంఘటనను ఒక కారణంగా చూపుతామని పేర్కొంది. ఢిల్లీ గ్యాంగ్‌రేప్‌కు వ్యతిరేకంగా ఎగిసిన నిరసన జ్వాల దేశంలో జరుగుతున్న అకృత్యాలపై ప్రజలలో గూడుకట్టుకున్న అసహనానికి అద్దం పడుతుంది. ఇక ఇలాంటి అరాచకాలను ఎంత మాత్రం సహించే, భరించే ఓపిక ప్రజలకు లేదన్నది నిర్వివాదాంశం. కొవ్వెక్కిన మగ మదమృగాల బారినుండి ఆడబిడ్డలను రక్షించే పనికి ప్రభుత్వాలు ఎంతకైనా తెగించక తప్పదు. ఎందుకంటే అమ్మ, అక్క, చెల్లి వున్న ప్రతి ఒక్కరూ ఢిల్లీ సంఘటన పట్ల ఆక్రోశంతో, ఆవేదనతో రగిలిపోతున్నారు. నిన్న ఢిల్లీలో జరిగిన దారుణాన్ని అలాగే ఉపేక్షిస్తే రేపు తమ ఇంట్లో జరగదనే గ్యారంటీ ఏముందని ప్రతి ఒక్కరూ ఆందోళన చెందుతున్నారు. స్త్రీని దేవతగా భావించి పూజించే దేశంలో ఒక్క 2011 సంవత్సరంలోనే నమోదైన నేరాలు 2,28,650. రాష్ట్రాల వారీగా చూస్తే మహిళలపై నేరాల జాబితాలో పశ్చిమబెంగాల్, ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలు అగ్రస్థానంలో వున్నాయి. దేశంలో అత్యాచారాల పర్వం ఒక ఉగ్రవాదంగా మారిపోయింది. ఒంటరిగా మహిళ వుండాలంటేనే వణికిపోతున్న కాలమిది. దేశంలో జనాభా పెరుగుతుంది. జనాభా రేటు కంటే అత్యాచారాల శాతం అతివేగంగా పెరుగుతుంది. నమోదైన కేసులే కాదు నమోదుకాకుండానే ఎన్నో అత్యాచార దుర్ఘటనలు చీకటి చరిత్రలో కలిసిపోతున్నాయి. కుటుంబగౌరవం వీధులపాలవుతుందనే భయంతో చాలామంది తమపై జరిగిన అకృత్యాలను బయటకు చెప్పుకోలేకపోతుంటే, నమోదైన కేసుల్లో దోషులకు శిక్షలు పడక ఈ కేసులు నీరుగారిపోతున్నాయి. జాతీయ నేర నమోదు సంస్థ గణాంకాల ప్రకారం మహిళలపై అత్యాచారాలు ఆందోళనకర స్థాయిలో వుంటే దోషులకు శిక్షలు మాత్రం 22 శాతం దగ్గరే తచ్చాడుతున్నాయి. మిగతా కేసుల నిందితులు నిర్భయంగా వీధుల్లో తిరుగుతూ మరెన్నో అత్యాచారాలకు పాల్పడుతున్నారు. అంతెందుకు మన ప్రజాప్రతినిధులలో ఎంతమందిపై అత్యాచార కేసులు లేవు. వీళ్లంతా మన చట్టాలను రాస్తుంటే, మన తలరాతలను మారుస్తుంటే ఇక మనకు న్యాయం జరిగేదెక్కడ?

నాలుగేళ్ల క్రితం వరంగల్‌లో ఓ విద్యార్థినిపై యాసిడ్‌దాడి జరిగింది. ఆ దాడికి పాల్పడ్డ నిందితులను పోలీసులు ఎన్‌కౌంటర్‌లో కాల్చిచంపారు. అది చట్టాలను, కోర్టులను అతిక్రమించిన ఆటవిక న్యాయమే అయినా ఆరోజుకు అదే సరైన తీర్పని ప్రజలు భావించారు. యాసిడ్ దాడులు, అత్యాచారాలు జరిగినప్పుడు కఠినశిక్షలు అమలుచేయడం కాదు... వాటి అవసరం రాకుండా చూడడం ప్రభుత్వం ముందున్న బాధ్యత. అందుకే మన పాలకులు ఇప్పటికైనా కళ్లు తెరవాలి.

## 'అంతర్'జాతీయం

- భారత్‌లో పెరుగుతున్న సామూహిక అత్యాచారాలపై ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేసింది. దేశంలో ప్రతి ఏటా 7200మంది చిన్నారులు, పసిపాపలు అత్యాచారాలకు గురవుతున్నారని భారత్‌లోని యూనిసెఫ్ ప్రతినిధి లూయీజార్జెస్ ఆర్సెనాల్ట్, ఐరాస సమన్వయకర్త లిసెగ్రాండేలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.
- అత్యాచారాలపై కఠినచట్టాల కోసం యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ ప్రభుత్వానికి కొన్ని కీలకమైన సూచనలు చేసారు. నేరస్తులపై సత్వర చర్యలు తీసుకోవడంతో పాటు కఠినంగా శిక్షించేందుకు మరింత సమర్థవంతమైన చట్టాలను ఎలా రూపొందించాలనేదానిపై ఆమె సీనియర్ నాయకులు, న్యాయనిపుణులతో సమాలోచనలు జరిపారు.
- అమెరికాలో హిందువులపై జరుగుతున్న దాడులకు సంబంధించిన కేసులను ప్రత్యేకంగా విచారించాలని ఎఫ్‌బిఐ, అమెరికా న్యాయశాఖలను హిందూ అమెరికన్ సేవాసంఘం, హిందూ అమెరికన్ ఫౌండేషన్‌లు విజ్ఞప్తి చేసాయి.
- ఇంగ్లాండ్ క్రికెట్ టీం మాజీకెప్టెన్, క్రికెట్ కామెంటేటర్ టోనీగ్రెగ్ గత నెల 29వ తేదీ హఠాత్తుగా మరణించారు. ఆయన వయసు 66ఏళ్లు. గత కొంతకాలంగా ఆయన క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు.
- ఢిల్లీ గ్యాంగ్‌రేప్ బాధితురాలి మృతిపట్ల ఐక్యరాజ్యసమితి ప్రధానకార్యదర్శి బాన్‌కీమూన్ తీవ్ర సంతాపం తెలిపారు. ఈ కేసులో ప్రభుత్వం వేగంగా స్పందించి నిందితులకు కఠినశిక్షలు పడేలా చేయాలని సూచించారు.
- ఢిల్లీ అత్యాచార బాధితురాలి మృతిపై సింగపూర్ తీవ్రంగా స్పందించింది. తమ దేశంలో మరణశిక్షను రద్దు చేయాలన్న డిమాండ్‌ను తిరస్కరించేందుకు ఈ బాధితురాలి ఉదంతాన్ని ఉదాహరణగా చూపుతామని ఆ దేశ న్యాయ విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి కె.షణ్ముగం వెల్లడించారు.
- ఆదివారం తాలిబన్‌లు పాకిస్థాన్‌లో మారణహోమాన్ని సృష్టించారు. కరాచీలో తీవ్రవాదులు జరిపిన కారుబాంబు దాడిలో 19మంది చనిపోయారు. అలాగే అంతకుముందు వారు అపహరించిన 21మంది సైనికులను కిరాతకంగా కాల్చిచంపారు.
- భారత్, పాకిస్థాన్‌లు ఒప్పందం ప్రకారం మంగళవారం తమ అణుకేంద్రాల జాబితాలను పరస్పరం ఇచ్చిపుచ్చుకున్నాయి. ఇలా జాబితాను అందజేసుకోవడం ఇది 22వసారి.
- ఐవరీకోస్టులోని అబిజ్జాన్ నగరంలో జరిగిన కొత్త సంవత్సరం వేడుకలు విషాదాన్ని మిగిల్చాయి. ఒక స్టేడియంలో జరిగే బాణాసంచా వేడుకలకు సామర్థ్యానికి మించి జనం రావడంతో, ప్రవేశద్వారం వద్ద జరిగిన తొక్కిసలాటలో 75మంది మరణించగా 300మంది గాయపడ్డారు.

## వార్త వ్యాఖ్య

వార్త :- తెలంగాణపై ఏఐసిసిదే తుది నిర్ణయం. - బొత్స.
వ్యాఖ్య :- *తుదినిర్ణయం మీరు తీసుకుంటారని ఎవరూ అనడం లేదే...!*

వార్త :- జయలలితను ప్రధానిని చేద్దాం.
- అన్నాడిఎంకే సర్వసభ్య భేటీలో తీర్మానం.
వ్యాఖ్య :- *ఏం... అక్కడ వేగలేకపోతున్నారా?*

వార్త :- దేశానికి దక్కని పి.వి. - నివాళులర్పించిన ప్రణబ్.
వ్యాఖ్య :- *మీ పార్టీ మాత్రం ఆయనకు ఆ గౌరవం ఇవ్వలేకపోయింది.*

వార్త :- ఏకాభిప్రాయంతోనే విడిపోదాం. - మంత్రి టి.జి.వెంకటేష్.
వ్యాఖ్య :- *ఏకాభిప్రాయం ఎండమావే కదా?*

వార్త :- కాంగ్రెస్‌ను తరిమేయాలి. - పాదయాత్రలో చంద్రబాబు.
వ్యాఖ్య :- *అప్పుడు మీకు తోడుగా వుంటుందనా?*

వార్త :- రాష్ట్రం సమైక్యంగానే వుంటుంది. - లగడపాటి.
వ్యాఖ్య :- *లేకపోతే మీకే కదా సమస్య?*

వార్త :- అన్నీ కలిసి బాధ్యతను కాంగ్రెస్‌పైకి నెట్టాయి.
- తెలంగాణపై గుత్తా సుఖేందర్‌రెడ్డి.
వ్యాఖ్య :- *ఒప్పుకున్నాక గాడిద చాకిరి తప్పదుగా!*

వార్త :- అత్యాచార కేసులుంటే టిక్కెట్లు ఇవ్వొద్దు.
- పార్టీలకు రిటైర్డ్ ఐఏఎస్ లేఖ.
వ్యాఖ్య :- *ఇప్పటిదాకా అవి వుంటేనే ఇస్తున్నారు.*

వార్త :- బుల్లెట్‌రైళ్లు ఇప్పుడే కాదు. - రైల్వేబోర్డు ఛైర్మెన్.
వ్యాఖ్య :- *పట్టాలు గట్టిగా వేసాకనా?*

వార్త :- తెలుగులోనే నామఫలకాలు.
- కార్మికశాఖ కమీషనర్ రామాంజనేయులు.
వ్యాఖ్య :- *వాటిని చదివి అర్థం చేసుకోవడానికి క్రింద ఇంగ్లీష్‌లో రాయాలేమో!*

వార్త :- కుర్చీ కోసమే టీడీపీ రాజకీయం. - మంత్రి పార్థసారథి.
వ్యాఖ్య :- *మీరే ఒక కుర్చీ కొనిస్తే పోలా!*

వార్త :- ఏప్రిల్ 1 నుండి రాష్ట్రవ్యాప్తంగా నగదు బదిలీ.
వ్యాఖ్య :- *జనాన్ని ఫూల్ చేయడానికి ఆ తేదీని ఎంచుకున్నారా!*

వార్త :- కాంగ్రెస్‌కు ఆణిముత్యం ఆయన.
- వై.యస్.ను కొనియాడిన మంత్రి రఘువీర.
వ్యాఖ్య :- *ఆణిముత్యం అని తెలిసే బురద జల్లుతున్నారన్నమాట!*

PDF Compressor Free Version



# కిరాయి కసాయిలు

ఒక పక్క దోపిడీదొంగలు... మరోపక్క కసాయి కిరాయి హంతకులు... ఆడవాళ్లు ఇంట్లో వుండాలన్నా భయమే... వీధుల్లోకి పోవాలన్నా భయమే. రోడ్డు మీద నడిచి వెళుతుంటే ఏ దొంగ వెధవ బైక్‌మీద వచ్చి మెడలో వున్న దండలు లాక్కుపోతారో తెలియదు, ఇంట్లో తలుపేసుకుని వున్నామా అంటే... అలా కూడా భద్రత లేకుండా పోయింది. మన చుట్టూ వున్నవాళ్లలో ఎవరు మంచివాళ్లో, ఎవరు చెడ్డవాళ్లో, ఎవరు దుర్మార్గులో పసిగట్టలేని పరిస్థితి.

జిల్లాలో ఈ మధ్యంతా దొంగల బెడదతో ప్రజలు హడలిపోయారు. నెల్లూరు జిల్లాను దొంగలముఠాలు కాంట్రాక్ట్‌కు తీసుకున్నాయన్నట్లుగా దొంగతనాలు జరిగాయి. జిల్లా చరిత్రలో చూసుకుంటే చోరీలలో 2012 సంవత్సరం ఒక ట్రాక్ రికార్డుగా నిలిచిపోయే వుంటుంది. ఇప్పుడు దొంగలే కాదు, కిరాయి హంతకులు కూడా ప్రజలను వణికిస్తున్నారు. నెల్లూరు, కావలి పట్టణాలలో ఇటీవల చోటుచేసుకున్న రెండు దారుణ హత్యలే కిరాయి హత్యల సంస్కృతికి అద్దం పడుతున్నాయి.

ఇటీవల నెల్లూరు మూలాపేటలో అమరజ్యోతి అలియాస్ మెహతాజ్ అనే వివాహిత దారుణహత్యకు గురైంది. ఆమె భర్త ఇస్మాయిల్ పథకం ప్రకారం ఆమెను వదిలించుకోవడానికి తన స్నేహితుడు, చిత్తూరుజిల్లాకు చెందిన మరో నేరస్థుడితో కలిసి ఆమె ప్రాణాలు తీసారు. హత్య జరిగిన రోజున ఇస్మాయిల్ బయట వుండి కిరాయి హంతకులతో పని కానిచ్చాడు. పోలీసులు తమదైన రీతిలో విచారణ చేసేసరికి నిజాలు బయటకొచ్చాయి.

అలాగే కావలిలో సంచలనం సృష్టించిన విజయ లాడ్జి యజమాని భార్య విజయ హత్యకేసులోనూ కర్నూలుకు చెందిన కిరాయి హంతకులు వున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. విజయ కాంప్లెక్స్‌లో అద్దెకు వుంటున్న ఓ దుకాణ యజమాని ఈ హత్యకు అసలు సూత్రధారిగా తెలుస్తుంది. విజయమ్మ నగలపై కన్నేసిన ఆ వ్యాపారి తన దగ్గర పనిచేసే గౌరవరంకు చెందిన ఓ వ్యక్తితో పాటు కర్నూలు జిల్లాకు చెందిన మరో ముగ్గురుతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. విజయమ్మ హత్య జరిగిన రోజున ఆ దుకాణయజమాని విజయ భర్త గోవిందరెడ్డితో కలిసి కారులో జలదంకి వెళ్లాడు. వాళ్లు తిరగొచ్చేలోపే ఇక్కడ విజయ హత్య జరిగింది. ఆ దుకాణ యజమాని గోవిందరెడ్డితో కలిసి వెళ్లినట్లు సాక్ష్యం సృష్టించి ఇక్కడ మాత్రం కిరాయి హంతకులతో ఆమెను హత్య చేయించి, బంగారు ఆభరణాలు అపహరించినట్లు తెలుస్తుంది. ఈ కేసులో నిందితులను పోలీసులు పట్టుకున్నారు.

మొత్తానికి కిరాయి హత్యలతో జిల్లాలో ఆందోళన వ్యక్తమవుతుంది. జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమై వీటిని అరికట్టాల్సి వుంది.

# సహకార ఎన్నికలకు అంతా సిద్ధం

వ్యవసాయ పరపతి సహకార సంఘాల ఎన్నికల ప్రక్రియ ఎలాంటి సమస్యలు లేకుండా సమర్థవంతంగా నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్ పేర్కొన్నారు.

బుధవారం తన ఛాంబర్లో సహకార సంఘాల ఎన్నిక ప్రక్రియపై జరిగిన సమీక్షాసమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానంగా వ్యవసాయ పరపతి సహకార సంఘాల ఎన్నికలు కీలకమైనవని గ్రామ స్థాయిలో వివిధ సమస్యలు పునరావృత్తం కాకుండా నిబంధనల మేరకు కట్టుదిట్టమైన జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. సహకార సంఘాల కేంద్రాల పరిధిలో పోలింగ్ ప్రక్రియకు సంబంధించి అవసరమైన పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ అధికారులను, పోలింగ్ సిబ్బందిని నియమించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 99 వ్యవసాయ పరపతి సహకార సంఘాలకు ఎన్నికలు రెండు దఫాలుగా జరుగుతాయని మొదటి దఫాగా 53 సహకార సంఘాలకు, రెండవ దఫా 46సహకార సంఘాలకు నిర్వహించడం జరుగుతుందన్నారు. మొదటిదశ జరిగే ఎన్నికలకు సంబంధించి జనవరి 24న ఓటర్ల జాబితా పబ్లిష్‌చేయడం, 28న నామినేషన్లు తీసుకోవడం, 29న పరిశీలన, 30న ఉపసంహరణ, ఫిబ్రవరి 2న పోలింగ్ ప్రక్రియ జరుగుతాయని అందుకు అవసరమైన భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు.

జిల్లా సహకార శాఖాధికారి ఎస్.సుబ్బారావు మాట్లాడుతూ నెల్లూరు డివిజన్ పరిధిలో మొదటి దఫా 11 సహకార సంఘాలకు, రెండవదఫా 13 సహకార సంఘాలకు, గూడూరు డివిజన్ పరిధిలో మొదటి దఫా 21 సహకార సంఘాలకు, రెండవదఫా 15సహకార సంఘాలకు, కావలి డివిజన్ పరిదిలో మొదటి దఫా 21సహకార సంఘాలకు, రెండవదఫా 18 సహకార సంఘాలకు ఎన్నికలు జరుగుతాయని వివరించారు.

ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.రామిరెడ్డి, గూడూరు సబ్ కలెక్టర్ జి.నివాస్, నెల్లూరు ఆర్.డి.ఓ కె.మాధవీలత, నెల్లూరు డివిజన్ సహకార అధికారి సుధారాణి, కావలి డివిజన్ సహకార అధికారి అంజిరెడ్డి, గూడూరు డివిజన్ సహకార అధికారి రాజేశ్వరరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు సమాధి

(మొదటిపేజీ తరువాయి)

లాగేసుకుంటుంది. వై.యస్. పెట్టిన పథకాలన్నింటికి దాదాపు మంగళం పాడే పరిస్థితి వచ్చింది. ఇక సర్‌ఛార్జీలు, పన్నులు కిరణ్ హయాంలో వున్నంత ఘోరంగా, దారుణంగా గతంలో ఏ ముఖ్యమంత్రి హయాంలోనూ లేవు. పన్నుల విషయంలో ఔరంగజేబును తలపించేలా కిరణ్ పాలన నడుస్తుంది. కరెంట్ బిల్లుల మీద వస్తున్న సర్‌ఛార్జీలతో రాష్ట్రంలో ప్రజలంతా సతమతమవుతున్నారు. కరెంట్ బిల్లు చేతికి తీసుకోగానే ప్రతి ఒక్కరూ చేస్తున్న పని కిరణ్‌కుమార్‌రెడ్డిని తిట్టుకోవడం, వైయస్ వున్నప్పుడు ఈ బాధలన్నీ లేవంటూ ఆయనను గుర్తు చేసుకోవడం. ఇంకా ప్రజల నుండి ఎన్ని రకాలుగా పన్నులు వసూలు చేయాలో అన్నింటిని వసూలు చేస్తున్నారు. వై.యస్. హయాంలో ప్రజలు ఎంతగా లబ్దిపొందారో, వారి చేత అంతకంతకు కక్కిస్తున్నాడు కిరణ్‌కుమార్‌రెడ్డి.

కాంగ్రెస్‌ను తిరిగి అధికారంలోకి తెస్తామన్న ధీమా గానీ, తేవాలన్న కోరిక గాని కిరణ్‌లో లేవు. కాబట్టి ఎడాపెడా ప్రజలను బాదేస్తూ, ప్రత్యక్షంగా కాంగ్రెస్‌కు సమాధి కడుతూ పరోక్షంగా వైయస్సార్ కాంగ్రెస్ ఓటుబ్యాంకు పెరగడానికి సహకరిస్తున్నాడు. అందుకే వైకాపా వారికి ఈరోజు కాకపోయినా రేపయినా కిరణ్ ఆపద్బాంధవుడే!

# అధికారులదే రాజ్యం

(మొదటిపేజీ తరువాయి)

నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి వుంటే మొన్నటివరకు వివేకా అడుగుజాడల్లో నడిచాడు. సడెన్‌గా ఇప్పుడు అధికారులపై పెత్తనం చెలాయించలేకపోతున్నాడు. తెలుగుదేశం, వైకాపా ఎమ్మెల్యేలకు అధికారులు మాట వినే పరిస్థితి లేదు. జనం గోడు గోడలకు చెప్పుకున్నట్లే అవుతుంది.

ముఖ్యంగా నెల్లూరులో మున్సిపల్, రెవెన్యూ ఉద్యోగుల ఆగడాలకైతే అసలు అడ్డూఅదుపే లేకుండా పోయింది. వివేకా లేకపోవడంతో వారు ఆడిందే ఆట... పాడిందే పాటగా పెత్తనం చెలాయిస్తున్నారు.

## అధ్వాన్నపు రోడ్డుపై అవస్థల ప్రయాణం

కావలి డివిజన్‌లో కావలి పట్టణం తర్వాత పెద్దపట్టణం వింజమూరు. చాలా గ్రామాలకు ముఖ్యకూడలి. విద్య, వైద్య, వ్యాపార పరంగా ప్రతిరోజూ అభివృద్ధి చెందుతున్న ఊరు. ప్రతిరోజూ కొన్ని వందల వాహనాలు ఈ ఊరులోకి రాకపోకలు సాగిస్తుంటాయి. జిల్లా కేంద్రమైన నెల్లూరు నుండి వింజమూరుకు రెండు మార్గాలున్నాయి. ఒకటి సంగం, కలిగిరి మీదుగా, రెండోది సంగం, ఆత్మకూరు మీదుగా. ఈ రెండురోడ్లు కూడా ఎప్పుడూ అధ్వాన్నస్థితిలోనే వుంటాయి. ముఖ్యంగా సంగం కలిగిరిల మధ్య వున్న సింగిల్‌రోడ్డు ఎప్పుడూ గతుకులమయమే. ఈ రోడ్డులో ప్రయాణమంటేనే పెద్ద అవస్థ.

ఆత్మకూరు, వింజమూరుకు మధ్య దూరం పాతిక కిలోమీటర్లు. నెల్లూరుపాలెం నుండి వింజమూరు మధ్య రోడ్డు పూర్తిగా గుంటలమయమైపోయింది. గట్టిగా అరగంట ప్రయాణానికి గంటసేపు అవస్థ పడాల్సివస్తుంది. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దీనిని డబుల్‌రోడ్డు చేసేందుకు నిధులు మంజూరు చేసారు. ఈ పనులను త్వరగా మొదలుపెడితే ప్రయాణంలో అవస్థలు తప్పుతాయి.

## మంత్రులు నిర్దోషులైతే..

# జగన్ దోషి ఎలా అవుతాడు?

**కాంగ్రెస్‌పార్టీకి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సూటిప్రశ్న**



సంతకాలు సేకరిస్తున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వైకాపా నాయకులు

జగనన్న కోసం జనసంతకం కార్యక్రమం నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉధృతంగా సాగుతుంది. వై.యస్.ఆర్ కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు ఇంటింటికి వెళ్ళి సంతకాలు సేకరిస్తున్నారు. భక్తవత్సలనగర్, అనగుంట, గాంధీనగర్, జ్యోతినగర్, హౌసింగ్‌బోర్డు, ఫత్తేఖాన్‌పేటలలో సంతకాల సేకరణ శిబిరాలు ఏర్పాటుచేసి సంతకాలు సేకరించారు. ప్రజలు స్వచ్ఛందంగా, ఉత్సాహంగా ముందుకు వచ్చి సంతకాలు పెడుతూ జగన్మోహన్‌రెడ్డిని వేధిస్తున్న కాంగ్రెస్‌పార్టీకి శాపనార్థాలు పెడుతున్నారు.

ఈ సందర్భంగా భక్తవత్సలనగర్, గాంధీనగర్‌లలో జరిగిన సభలలో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ జగన్మోహన్‌రెడ్డిని జైల్లో పెట్టిందాకా మౌనం వహించి న్యాయస్థానాలకి తప్పుడు సమాచారం అందించి జగన్మోహన్‌రెడ్డిని జైల్లో పెట్టించిన తరువాత తాము చేసిన పాపం తమకే చుట్టుకున్నట్టు చేసిన కుట్ర, కుతంత్రాలకు తన మంత్రులు బలయ్యే పరిస్థితి ఎదురైందన్నాడు.

తన వారిని కాపాడుకునేందుకు బిసి మంత్రి మోపిదేవిని బలిచేసి మిగతా మంత్రులను రక్షించుకునేందుకు ఇప్పుడు వై.యస్ హయాంలో ఎలాంటి తప్పులు జరగలేదని అప్పుడు జారీచేసిన 26జీవోలు సక్రమమైనవేనని కాబట్టి తమ మంత్రులు నిర్దోషులని ముఖ్యమంత్రి దగ్గర్నుంచి ఏ.ఐ.సి.సి పెద్దల దాకా కొత్త పాట అందుకున్నారన్నారు. మరి 26 జీవోలు సక్రమమైనపుడు మంత్రులు నిర్దోషులైనపుడు ఆరోజు ఏ పదవిలోలేని జగన్ దోషి ఎలా అవుతాడో కాంగ్రెస్‌పార్టీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 26జీవోలు సక్రమమేనని జగన్మోహన్‌రెడ్డి అరెస్టు కాకముందు కోర్టులో ఎందుకు రాష్ట్రప్రభుత్వం అఫిడవిట్ ఫైల్ చేయలేదని ఆయన ప్రశ్నించారు.

ధైర్యం ఉంటే కాంగ్రెస్‌నేతలు బహిరంగ చర్చకురావాలని కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సవాల్ విసిరారు. అందుకే జరుగుతున్న రాజ్యాంగ ఉల్లంఘనకు నిరసనగా భారత రాష్ట్రపతికి కోటి సంతకాల విజ్ఞాపన అని చెప్పారు. ఈ కార్యక్రమంలో కొండారెడ్డి, రాహుల్, సాయిరెడ్డి, దేవిడ్, కోటేశ్వరరావు, మునుస్వామిరెడ్డి, భాస్కర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో...

# మాజీఎంపిపి కన్నుమూత

మంగళవారం వెంకటాచలం మండలం చెముడుగుంట వద్ద జాతీయ రహదారిపై ఆగివున్న లారీని కారు ఢీకొన్న దుర్ఘటనలో బాలాయపల్లి మాజీ మండలాధ్యక్షురాలు వెందోటి సౌజన్యరెడ్డి మృతి చెందగా ఆమె భర్త మధుసూదన్‌రెడ్డి గాయపడ్డారు. మధుసూదన్‌రెడ్డి, సౌజన్యలు మంగళవారం నెల్లూరులో పనులు ముగించుకుని మధ్యాహ్నం స్వగ్రామమైన జయంపుకు కారులో బయలుదేరారు. వీళ్లు బాలాజీస్టీల్ ఫ్యాక్టరీ సమీపంలోకి రాగానే ముందు కంకర లోడ్‌తో వెళుతున్న లారీని డ్రైవర్ సడెన్‌బ్రేక్ వేసి హైవే మార్జిన్‌లోకి తిప్పాడు. లారీ వెనుకనే వున్న కారును నడుపుతున్న మధుసూదన్‌రెడ్డి కారును అదుపుచేయడం కష్టమైంది. లారీ వెనుకభాగం క్రింద కారు దూరి నుజ్జునుజ్జయ్యింది. సౌజన్య అక్కడికక్కడే మృతిచెందగా మధుసూదన్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. సౌజన్య ఎంపీపీగా, అంతకుముందు జడ్పీటీసీగా కూడా పనిచేసి వున్నారు.

ఆమె మృతితో బాలాయపల్లి మండలంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సౌజన్య ప్రముఖ సినీనిర్మాత, మల్లెమాల రామాయణం గ్రంథకర్త డాక్టర్ యం.యస్.రెడ్డి సోదరుడి కుమార్తె కావడం గమనార్హం.

## కాలధర్మం

# ఎస్పీ జగదీష్



ప్రముఖ సినీ నేపథ్యగాయకులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సోదరుడు ఎస్పీ జగదీష్(52) డిసెంబరు 28న మృతిచెందారు. ఆయనకు హఠాత్తుగా గుండెనొప్పి రావడంతో చెన్నైలోని గ్లోబల్ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మధ్యాహ్నం 2గంటలకు తుదిశ్వాస విడిచారు. జగదీష్‌కు భార్య రాజావాగ్దేవి, కుమారుడు అభిషేక్ ఉన్నారు. ఆయన కోదండపాణి రికార్డింగ్ థియేటర్‌లో సౌండ్ ఇంజనీర్‌గా పనిచేయడమే కాక పలు టి.వి. కార్యక్రమాలకు సంగీతం అందించారు. ఆయన మృతిపట్ల సంతాపం ప్రకటిస్తూ బాలు కుటుంబానికి సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

PDF Compressor Free Version






ఆదివారం నెల్లూరులోని టూరిజం హరిత హోటల్‌లో ఫ్లెమ్మింగో ఫెస్టివల్ ప్రచార రథాన్ని పచ్చజెండా ఊపి ప్రారంభిస్తున్న రాష్ట్ర ఆర్థికశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పక్కన ఎమ్మెల్యేలు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, పరసా రత్నం, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్ తదితరులు

## స్వర్ణభారత్‌లో వ్యాసరచన, ముగ్గుల పోటీలు

స్వామి వివేకానంద 150వ జయంతి సందర్భంగా వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 6వ తేదీ నెల్లూరులోని వి.ఆర్.హైస్కూల్ మైదానంలో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ డైరెక్టర్ వి.పద్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 10.30 గంటల నుండి 12గంటల వరకు ఈ పోటీలు జరుగుతాయి. మొదట క్యాటగిరి క్రింద 6నుండి 10వ తరగతి వరకు విద్యార్థులకు, రెండవ క్యాటగిరిలో ఇంటర్, ఆపై విద్యార్థులకు 'నేటి యువ తరానికి స్వామి వివేకానందుని సందేశాల ఆవశ్యకత' అనే అంశంపై వ్యాసరచన పోటీలు జరుగుతాయి. ప్రతి క్యాటగిరిలో మూడు బహుమతులుంటాయి. ఆసక్తిగల విద్యార్థులు 6వ తేదీ 10గంటలలోపు వి.ఆర్.హైస్కూల్ మైదానంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలి.

### ముగ్గుల పోటీలు:

అలాగే సంక్రాంతి పండుగను పురస్కరించుకుని 6వ తేదీ ఉదయం 10 నుండి 11గంటల వరకు జిల్లాలోని నెల్లూరు, బుచ్చిరెడ్డిపాలెం, కావలి, ఉదయగిరి, పొదలకూరు, గూడూరు, వెంకటగిరి, ఆత్మకూరులలో ముగ్గులపోటీలు నిర్వహిస్తున్నారు. 8వ తేదీ వెంకటాచలంలో జరుగుతాయి. ఈ పది సెంటర్లలో కూడా మొదటి మూడు బహుమతులుంటాయి. 11వ తేదీ వెంకటాచలం స్వర్ణభారత్ ట్రస్ట్ ఆవరణలో ఫైనల్ ముగ్గుల పోటీలుంటాయి. వీటిలో మొదటి ముగ్గురు విజేతలకు 5000, 4000, 3000 లెక్కన నగదు బహుమతులుంటాయి. 11వ తేదీ ట్రస్ట్ ఆవరణలో జరిగే సంక్రాంతి సంబరాలలో బీజేపీ జాతీయ నాయకులు యం.వెంకయ్యనాయుడు, జార్ఖండ్ ముఖ్యమంత్రి అర్జున్ ముండా విజేతలకు బహుమతులందజేస్తారు.

## పేకాట పాపారావుల అరెస్ట్

నెల్లూరు మైపాడురోడ్డులోని శ్రీనివాస నగర్‌లో ఓ పేకాట కేంద్రంపై మంగళవారం రాత్రి రెండోనగర పోలీసులు దాడి చేసి 10మంది పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసారు వారి నుండి 34వేల రూపాయలు స్వాధీనం చేసుకున్నారు.

## విశ్వసాయి విద్యార్థుల చేయూత



చిన్నారులకు పండ్లు, దుస్తులు అందజేస్తున్న కళాశాల విద్యార్థినులు

నగరంలోని విశ్వసాయి విద్యాసంస్థల ఆధ్వర్యంలో బి.వి. నగర్‌లోని వాత్సల్య అనాథ ఆశ్రమంలో వృద్ధులకు, చిన్నారులకు ఆదివారం పండ్లు, దుస్తులు, మిఠాయిలు, నిత్యావసర వస్తువులు, బిస్కెట్లు అందజేశారు. కళాశాల డైరెక్టర్లు డా.ఎస్.సత్యనారాయణ మరియు జి.కృష్ణమోహన్‌లు మాట్లాడుతూ మా విద్యార్థులు, విద్యలోనే కాకుండా సామాజిక సేవలో కూడా ముందుంటారని తెలిపారు. విశ్వసాయి విద్యార్థులు మాట్లాడుతూ తమ పాకెట్ మనీతో ఈ ఆశ్రమంలోని చిన్నారులకు మరియు వృద్ధులకు పండ్లు, దుప్పట్లు, స్వీట్లు పంచిపెట్టడం ఎంతో తృప్తితో పాటు సంతోషాన్నిచ్చిందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కళాశాల జనరల్ మేనేజర్, ప్రిన్సిపాల్స్ వాటాధికారులు మరియు అధ్యాపకులు తమవంతు సహాయాన్ని అందచేస్తూ ఈ కార్యక్రమం పట్ల సంతృప్తిని వ్యక్తపరిచారు.

## ఎన్‌ఎండి ఛారిటీస్ ఉచిత వైద్య శిబిరం



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ విజ్ఞాన్‌కుమార్

నెల్లూరు జెండావీధిలోని ఎన్‌ఎండీ ఛారిటీస్ డిసెంబర్ 30న ఉచిత వైద్య శిబిరం నిర్వహించింది. ఊపిరితిత్తుల వ్యాధుల నిపుణులు డాక్టర్ విజ్ఞాన్‌కుమార్ రోగులను పరీక్షించి సలహాలిచ్చారు. ఛారిటీస్ బాధ్యులు కొండా శివారెడ్డి, జహీర్, ఉమర్, శ్రీకాంత్‌రెడ్డి, మేనేజర్ ఖాలిద్, ఛైర్మెన్ నిజాముద్దీన్ ఆధ్వర్యంలో ఉచితంగా మందులు పంపిణీచేశారు.

ఈ సందర్భంగా నిజాముద్దీన్ మాట్లాడుతూ ప్రతి ఆదివారం ప్రత్యేక వైద్యనిపుణులతో ఉచిత వైద్యశిబిరాలను నిర్వహించి వైద్యసేవలందిస్తున్నామని తెలిపారు. డాక్టర్ విజ్ఞాన్‌కుమార్, మాట్లాడుతూ ఎన్‌ఎండీ ఛారిటీస్ ఎంతో మంచి పని చేస్తుందని దీనికి తనవంతు సహాయం ఎల్లప్పుడూ వుంటుందని పేర్కొన్నారు.

## హైదరాబాద్ వెళ్లిన నెల్లూరు కాంగ్రెస్ నేతలు

డిసెంబర్ 23 తన పుట్టినరోజు నాడు, జనవరి 1 కొత్త సంవత్సరం రోజున నెల్లూరురూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి జనానికి అందుబాటులో వుండేవాడు కాదు. ప్రతి సంవత్సరం ఆ రెండు రోజులు ఆయన రహస్య శిబిరంలో వుండేవాడు. సంవత్సరంలో మిగతా అన్నిరోజులూ జనం మధ్య వుండే వివేకాకు ఆ రెండురోజులే జనం మధ్య వుండడం ఇష్టం వుండేది కాదు. ఫోన్‌లకు కూడా అందుబాటులో లేకుండా వెళ్లిపోయేవాడు. కాని ఈ సంవత్సరం మాత్రం ఆయనకు అలాంటి అవకాశం లేకుండాపోయింది. అనారోగ్యం వల్ల ఆయన ఎటూ కదలలేక హైదరాబాద్‌లో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి బంగ్లాలోనే వుంటున్నారు. అభిమానులు, అనుచరుల తాకిడి ఎక్కువుగా వుంటుందని మొన్న పుట్టినరోజునాడు మాత్రం స్టార్ ఆసుపత్రిలో వుంచారు. కాని జనవరి 1వ తేదీ మాత్రం ఆయన మంత్రి బంగ్లాలోనే వుంటున్నాడని తెలిసి నెల్లూరు నగరానికి చెందిన కాంగ్రెస్ నాయకులు చాలామంది హైదరాబాద్ ట్రైన్ ఎక్కేసారు. తొలిసారిగా ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు.

## ఆర్‌ఎంగా బాధ్యతలు చేపట్టిన రవి



నెల్లూరు ఆర్టీసీ రీజియన్ మేనేజర్‌గా ఏలూరు ఆర్‌ఎంగా పని చేస్తున్న చింతా రవికుమార్ డిసెంబర్ 29న బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు ఆర్‌టిసిలో ఇప్పటివరకు ఆర్‌ఎంగా పనిచేస్తుండిన కొమరయ్య ఆయనకు బాధ్యతలు అప్పగించారు.

## 'క్యాప్'లో... కొత్త సంవత్సర సందడి

నెల్లూరు కొండాయపాలెం గేటు వద్ద గల 'క్యాప్' కార్యాలయంలో మంగళవారం రాత్రి నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా న్యాయమూర్తి శ్రీరామ్మూర్తి, ఎస్పీ బి.వి. రమణకుమార్‌లు ఈ వేడుకలకు హాజరై 'క్యాప్' విద్యార్థుల చేత కేక్‌ను కోయించారు. అలాగే ఢిల్లీ గ్యాంగ్‌రేప్ బాధితురాలు నిర్భయ ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ ఈ సంవత్సరం జిల్లాలో నేరాలు తగ్గుముఖం పట్టి ప్రజలు సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు. యువతలో నేర ప్రవృత్తి పెరిగిపోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తూ, మొగ్గ దశలోనే దీనిని తుంచేయాలని, ఇందుకోసం కఠినచట్టాలను తీసుకురావాలన్నారు. ఎస్పీ రమణకుమార్ మాట్లాడుతూ పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఎంతో అవసరమని, బాల్యం నుండే వారికి మంచి ప్రవర్తన కల్పిస్తే నేరాలు వుండవని అన్నారు.

## నెల్లూరు కబుర్లు

## కోలాహలంగా.. కొత్త సంవత్సర వేడుకలు

2012కు వీడ్కోలు పలుకుతూ 2013ను స్వాగతిస్తూ సోమవారం అర్ధరాత్రి నుండి మంగళవారం వరకు నూతన సంవత్సరవేడుకలను ప్రజలు కోలాహలంగా జరుపుకున్నారు. సోమవారం రాత్రి నెల్లూరు నగరంలో ఎక్కడ చూసినా పండుగ వాతావరణమే కనిపించింది. పాత సంవత్సరానికి యువత ఎక్కువమంది మద్యం మత్తులోనే వీడ్కోలు పలుకుతుంటారు. సోమవారం రాత్రి నెల్లూరులోని అన్ని బార్లు, బ్రాందీషాపులు మందుబాబులతో కిటకిటలాడాయి. మద్యం అమ్మకాలు ఎడతెరపి లేకుండా సాగాయి. రెస్టారెంట్‌లు భోజనప్రియులతో కళకళ



లాడాయి. అర్ధరాత్రి 12గంటలు కాగానే 2012కు గుడ్‌బై చెబుతూ 2013కు కేరింతలతో స్వాగతం పలికారు. యువకులు బైక్‌ల మీద తిరుగుతూ అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మద్యంమత్తులో యువకులు మోటార్‌సైకిళ్లపై వీరవిన్యాసాలు చేసారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు కళ్లల్లో వత్తులు వేసుకుని కాపలాకాసారు. 1వ తేదీ ప్రముఖుల నివాసాలు శుభాకాంక్షలు చెప్పడానికి వచ్చిన అభిమానులతో సందడిగా కనిపించాయి.ఎస్పీ, జిల్లా న్యాయమూర్తి, జాయింట్ కలెక్టర్, అదనపుజాయింట్‌కలెక్టర్, ఆర్డీవో, నగరపాలక [illegible] కమీషనర్, ఏఎస్పీ, ఆర్టీవో, డిఎంఅండ్‌హెచ్‌ఓ ఇలానే పలుశాఖల ఉన్నతాధికారులు, రాజకీయ ప్రముఖుల ఇళ్లవద్ద నూతన సంవత్సర సందడి బాగా కనిపించింది.

## సరస్వతీనిధికి వితరణ



కలెక్టర్‌కు విరాళం అందజేస్తున్న షర్మిల పద్మశ్రీ, లీలామహాలక్ష్మి

నెల్లూరు బోసుబొమ్మ దగ్గర గల ఆర్‌కెటి పెట్రోలు బంకు వ్యవస్థాపకులు స్వర్గీయ తూపిలి రాధయ్య జయంతి సందర్భంగా వారి మునిమనుమరాళ్ళు షర్మిల పద్మశ్రీ, లీలామహాలక్ష్మిలు సరస్వతీనిధికి జనవరి 1న 25వేల రూపాయలు విరాళంగా జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్‌కు చెక్కురూపంలో అందించారు. జిల్లా కలెక్టర్ మానసపుత్రిక సరస్వతీనిధికి తాతయ్య స్వర్గీయ తూపిలి రాధయ్య ఆశయం మేరకు ఈ చిన్నారులు ఈ వితరణ చేశారు.

## బిఎస్‌ఎన్‌ఎల్ ఖాతాదారుల కోసం రీ-కనెక్షన్ మేళా

2013 నూతన సంవత్సర కానుకగా బిఎస్‌ఎన్‌ఎల్ వినియోగదారులకు ఈ నెల 3 నుండి 23వ తేదీ వరకు రీకనెక్షన్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ జి.ఎం గోపి ఒక ప్రకటనలో తెలిపారు. డిస్కనెక్ట్ అయిన ల్యాండ్‌లైన్, బ్రాడ్‌బ్యాండ్ వినియోగదారులు సులభ వాయిదాపద్ధతిలో పాతబకాయిలు చెల్లించి రీకనెక్షన్ పొందవచ్చని వెల్లడించారు. 3వేల రూపాయల బకాయిలుంటే 5వాయిదాలలో, ఆపైన బకాయిలుంటే 10 వాయిదాలలో చెల్లించవచ్చునని ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని కస్టమర్ సర్వీస్‌సెంటర్‌లలో ఈ మేళాను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

PDF Compressor Free Version



# జంట కాంగ్రెస్‌లను తరిమికొట్టండి

సింహపురి సమాచారం



నెల్లూరులో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న 'దేశం' కార్యకర్తలు

అధికార దుర్వినియోగంతో అక్రమాలకు హద్దులేకుండా చేస్తున్న కాంగ్రెస్‌ను, అవి నీతిలో టాప్‌ర్యాంక్ సాధించిన వైయస్సార్ కాంగ్రెస్‌ను తరిమికొట్టాల్సిన సమయం ఆసన్నమైందని మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. చంద్రబాబు చేస్తున్న 'వస్తున్నా మీ కోసం పాదయాత్ర' 1400కిలోమీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నెల్లూరులో సోమవారం జిల్లా తెలుగుదేశంపార్టీ ఆధ్వర్యంలో సంఘీభావం ర్యాలీ నిర్వహించారు. నగరంలోని విఆర్‌సి సెంటర్ నుండి నర్తకి సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వరకు ఈ ర్యాలీ నిర్వహించగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎన్టీఆర్ బొమ్మ వద్ద జరిగిన సభలో సోమిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వాలలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. గ్యాంగ్‌రేప్ బాధితురాలిపై ఆ పార్టీ అధ్యక్షుడు బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలను చూస్తుంటేనే, మహిళల భద్రత పట్ల వాళ్లకేమాత్రం ఆసక్తి వుందో అర్థమవుతుందన్నారు. బొత్స వ్యాఖ్యలు రాజకీయ వ్యవస్థకే సిగ్గుచేటన్నారు. జగన్ వేలకోట్లు దోచుకుని జైల్లో వున్నాడని, ఇక్కడ ఆ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యేలు కూడా కాంట్రాక్టులు దక్కించుకునే పనిలో తీరికలేకుండా వున్నారని, ఇక వాళ్లకు ప్రజాసమస్యలను పట్టించుకునే తీరిక ఎక్కడుందని ఆయన ఎద్దేవాచేసారు. ఆనం వివేకానందరెడ్డి ఆసుపత్రిలో వున్నా నెల్లూరులో మధ్యస్తాలు, రౌడీయిజాలు ఆగడం లేదన్నారు. అధికారపార్టీ వారి అడుగులకు మడుగు లొత్తకుండా ప్రజాభద్రత కోసం పోలీసులు ధైర్యంగా పనిచేయాలన్నారు.

పార్టీ జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రంలో ప్రజల సమస్యలన్నీ తీరుతాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పన్నులు, సర్‌ఛార్జీలతో ప్రజలను బాదుతుందని, ఈ భారాన్ని మోయలేక ప్రజలు అశాంతితో రగిలిపోతున్నారని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బీద మస్తాన్‌రావు, బల్లి దుర్గాప్రసాద్, నాయకులు టి.రమేష్‌రెడ్డి, నూనె మల్లిఖార్జునయాదవ్, ధర్మవరం సుబ్బారావు, మున్వర్, కృష్ణమూర్తి, భువనేశ్వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కఠిన చర్యలు తప్పవు

కమీషనర్ ఆంజనేయులు



నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలో డిసెంబర్ 29న కమీషనర్ ఛాంబర్‌లో శానిటేషన్, ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్‌ల సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమీషనర్ అంజనేయులు అధికారులను ప్రశ్నించి పలుసూచనలు చేశారు. ఒక దశలో అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం ప్రకటించారు. నగరంలో ప్లాస్టిక్ కవర్ల విక్రయాలు సాగుతూనే వున్నాయి. మీరేం చేస్తున్నారని ప్రశ్నించి ఇకపై ఇలాగే సాగితే కఠినచర్యలు తప్పవని వారిని హెచ్చరించారు. పాడైపోయిన చెత్తడబ్బాలను తొలగించాలని వాటిస్థానంలో కొత్తవి ఏర్పాటుచేయాలని సూచించారు. రోడ్డు ప్రక్కన భవన వ్యర్థాలు తొలగించాలని, శిథిలమైన వాహనాలు, తుక్కును వేలం వేయాలని తెలిపారు. పైప్‌లైన్ల లీకేజిపై అశ్రద్ధ వద్దని, త్రాగునీరు సక్రమంగా సరఫరా జరిగేలా శ్రద్ధతీసుకోవాలని సూచిస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠినచర్యలు తప్పవన్నారు. సమావేశంలో ఎంఈ సంపత్‌కుమార్, శానిటరీ సూపర్‌వైజర్లు శివనాగేశ్వరరావు, పాయసం వెంకటేశ్వరరావు, డీఈలు అనిల్‌కుమార్, షరీఫ్, శాంతిరాజు, సుందరరామిరెడ్డి, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్, మహబూబ్‌ఖాన్, మొదలగువారు పాల్గొన్నారు.

# 'ఆధార్'పడాల్సిందేనా?

AADHAAR

మన ప్రభుత్వం దేనినీ సమర్థవంతంగా, సంపూర్ణంగా పూర్తి చేయదు. చేయాలనే చిత్తశుద్ధి కూడా వుండదు. తలాతోక లేని విధానాలకు శ్రీకారం చుట్టడం మన పాలకులకే చెల్లుతుంది.

జనవరి 1 నుండి నగదు బదిలీ పథకాన్ని ప్రారంభించారు. బాగానే వుంది... దీనికి ఆధార్ కార్డులను లింకు పెట్టారు. ఇప్పుడు ఆధార్‌కార్డులు ఎంతమంది లబ్దిదారుల వద్ద వున్నాయనేది పెద్ద ప్రశ్నగా మారింది. దేశంలో 'ఆధార్'కార్డుల జారీ ప్రక్రియ ఎక్కడా సంపూర్ణంగా పూర్తి కాలేదు. మన జిల్లాలోనే తీసుకుంటే 30శాతం మందికి కూడా ఇంకా ఆధార్‌కార్డులు దక్కలేదు. నగరంలో, పట్టణాలలో, గ్రామాలలో కొన్ని సెంటర్‌లను ఏర్పాటుచేసి అక్కడి వచ్చిన వాళ్లకు మాత్రమే ఫోటోలు తీసి ఆధార్‌కార్డులు మంజూరు చేస్తున్నారు. చాలామందికి ఆధార్‌కార్డుల మీద అవగాహన లేదు. ఎక్కడకు వెళ్లి వాటిని పొందాలనే సమాచారం కూడా లేదు. అమెరికాలో గ్రీన్‌కార్డు తరహాలో మన దేశంలో ఆధార్‌కార్డును తీర్చిదిద్దాలనుకున్నారు. కాని ఇక్కడ అది పేరు గొప్ప, ఊరు దిబ్బ అన్నట్లుగా తయారైంది.

జిల్లాలో 10లక్షల కుటుంబాలకు ఆధార్‌కార్డులు అందించాలి. కాని ఆ ప్రక్రియ నత్తనడకన సాగుతుంది. మరో పక్క ఆధార్‌కార్డు వుంటేనే పింఛన్‌లు ఇస్తామని అధికారులు మెలికపెడుతున్నారు. జిల్లాలో 3లక్షల మంది వితంతువులు, వికలాంగులు, వృద్ధులు నెలకు 500రూపాయల వంతున పింఛన్‌లు పొందుతున్నారు. ఇప్పటికి 30శాతం మందికే కార్డులు అందాయి. కార్డులు లేనివాళ్లు పింఛన్‌లు ఇస్తారో ఇవ్వరోనని ఆందోళనలోవున్నారు.




బుధవారం నెల్లూరు జడ్పీ సమావేశ మందిరంలో 'మనకు తెలియని మన చరిత్ర' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్, ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం తదితరులు

## • స్పందించిన జనహృదయం

# అత్యాచారమే మన ఆచారమా?



వైకాపా ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ



సైకత శిల్పం రూపంలో ఆవేదన

దుశ్శాసన, దుర్యోధన దుర్నీతి దుశ్చర్యలు చేసే నీచులు నడయాడుతున్న ఈ లోకంలో ఆమె ఒక్కటేకాదు ఏ ఆడపిల్లా బతికేలాలేదు. ఈ రోజు ఢిల్లీలో ఆమె గ్యాంగ్‌రేప్‌కు బలైంది. మొన్న వరంగల్‌లో ఒక యువతి యాసిడ్ దాడికి గురైంది. రేపు మరొక పడతి...అంతే!...! అంటే, ఈ దారుణాలకి అంతేలేదా. ఖచ్చితంగా వుంటుంది. మనిషిలో మానవత్వం కునారిల్లిపోకుండా వికసించినప్పుడు పదునైన చట్టాలతో ప్రభుత్వం వికృత చేష్టల దానవకృత్యాలను తుదముట్టించినప్పుడు కనీసం అటువైపు మన పాలకులు దృష్టి పెట్టేలా, ఢిల్లీలో బస్సులో కిరాతకంగా అత్యాచారానికి బలైపోయిన ఆ వైద్య విద్యార్థిని సంఘటన చేస్తుందేమో చూడాలి. మానసికంగా బలవంతురాలైనా, మదమెక్కిన మానవమృగాల దాడికి తట్టుకోలేక సామూహిక అత్యాచారానికి గురై 13రోజులు మృత్యువుతో పోరాడి తనువు చాలించిన "నిర్భయ" అనామత్ కాశ్మీరు నుండి కన్యాకుమారి దాకా దేశం మొత్తాన్ని కదిలించింది. డిసెంబర్ 28సాయంత్రం ఆమె మృతి చెందిన విషయం తెలిసి ప్రతి ఊరూ, ప్రతివాడా, ప్రతి వీధి రోదించింది.



టెలికాం ఉద్యోగుల నిరసన ప్రదర్శన

29వతేదీ నెల్లూరులో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీనేతలు డాక్టర్ పోలుబోయిన అనిల్‌కుమార్‌యాదవ్, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిల నేతృత్వంలో పార్టీ మహిళానేతలు హసీనా, జెస్సీ, సునీల్, అరుణమ్మ, సుజీత, మమతారెడ్డి, రమ్మ్మ కామేశ్వరి, లతారెడ్డి, సుభాషిణి, సుహాసిని తదితరులు, నేతలు పి.రూప్‌కుమార్‌యాదవ్, తాటి వెంకటేశ్వరరావు, బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి, సంక్రాంతి కల్యాణ్‌యాదవ్, లోకిరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, ఎస్.కె.సుభాన్ మొదలగువారు ఆమె ఆత్మకు శాంతికలగాలని కొవ్వొత్తులతో భారీ ప్రదర్శన నిర్వహించారు. నెల్లూరులో నర్తకిసెంటర్ నుంచి ఏసి సెంటర్, ట్రంకురోడ్డు మీదుగా గాంధీబొమ్మ వరకు ఈ ప్రదర్శన సాగింది. 30వతేదీ గాంధీబొమ్మ వద్ద సాహితీమిత్ర మండలి సభ్యులు డా॥ఈదూరు సుధాకర్, ఏటూరి నాగేంద్రరావు, చిన్ని నారాయణరావు, చలించర్ల భాస్కర్‌రావు, జనవిజ్ఞాన వేదిక నేతలు నారాయణ, అవ్వారు శ్రీధర్, ప్రగతిశీల ప్రజావేదికనేతలు కొండమ్మ, ప్రసాద్‌లు తెలుగు భాషోద్యమ సమితి సభ్యులు వివిధ కళాశాలల విద్యార్థినీ, విద్యార్థులు కొవ్వొత్తులు వెలిగించి ప్రదర్శన నిర్వహించారు. 31వతేదీ సంతపేట మార్కెట్ సెంటర్‌లో జిల్లా టెలికాం అడ్వయిజరీ కమిటీ సభ్యులు ప్రమిద శ్రీనివాసులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, దర్శి నర్సింహులు, కరేడు శ్రీనివాసులు, పవన్‌కుమార్ నాయుడు, ఏవి సుబ్బారావు ప్రసాద్‌మూర్తి తదితరులు పాఠశాల విద్యార్థులు కొవ్వొత్తులు వెలిగించి "నిర్భయ" అనామత్ ఆత్మకు శాంతిచేకూరాలని నివాళులర్పించారు. ఇలా నగరం నలుమూలలా ప్రజలు స్వచ్ఛంధంగా ఆమెకు నివాళులర్పించి, ఆమెపై జరిపిన దాష్టీకానికి, అరాచకానికి, హత్యాచారానికి పాల్పడ్డ నిందితులను కఠినాతికఠినంగా శిక్షించాలని ముక్తకంఠంతో కోరుతున్నారు.



నిరసన తెలుపుతున్న హిజ్రాలు



కొవ్వొత్తులతో విద్యార్థినులు

PDF Compressor Free Version



## కదంబం

## వెతుకులాట

డా.సి.భవానీదేవి,
హైదరాబాద్, 9866847000.

ఇల్లంతా చిందరవందరగా...
చికాకుగా...
పుస్తకాలూ, బట్టలు
పెన్నులు, గిన్నెలు
అస్తవ్యస్తమైన ఆశల తూలికల్లాంటి
జ్ఞాపకాలు...జ్ఞాపికలు
మసకేసిన మమకారంలా
చేతికి తగిలిన ఫోటో
చిన్నప్పటి అమ్మ ఒడిలా...
కాలేజి వరండాల్లోంచి
కరిగిపోయిన కలల్లా
కాలం మూగేసిన సర్టిఫికేట్లు
నల్లమబ్బుల్లోంచి రాలిన
పన్నీటి చినుకుల్లా
ఉద్వేగాలు పంచిన స్నేహాలేఖలు
ఎక్కిదిగిన మెట్ల మీంచి
ఒక్కొక్క వస్తువు మాట్లాడుతోంది
అయినా...
దేనికోసమో జ్వలిస్తూ వెతుకులాట...
ఈ నాలుగ్గోడల మధ్య
ఎప్పుడో పోగొట్టుకున్న
నా కోసమేనేమో!

## విగ్రహాల దొంగ అరెస్ట్

పలు దేవాలయాలలో విగ్రహాల దొంగతనాలకు పాల్పడుతున్న నెల్లూరు సంతపేటకు చెందిన గుంజి ప్రసాద్‌ను బుధవారం బాలాజీనగర్ పోలీసులు అరెస్ట్ చేసారు. బుధవారం బాలాజీనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డిఎస్పీ వెంకటనాథ్‌రెడ్డి మాట్లాడుతూ మొదట చిన్నచిన్న దొంగతనాలు చేస్తుండిన ప్రసాద్ ఆ తర్వాత విగ్రహాల దొంగతనాలు మొదలు పెట్టాడని, గత ఏడాది సెప్టెంబర్ 15న సర్వేపల్లిలోని ఆంజనేయ స్వామి దేవాలయంలో సీతారామలక్ష్మణ, ఆంజనేయస్వామిల పంచలోహ విగ్రహాలను దొంగలించాడని, ... ఆంజనేయ స్వామి విగ్రహాన్ని సర్వేపల్లి కాలువలో పడేసి మిగతా మూడు విగ్రహాలను తన ఇంట్లోనే పెట్టుకున్నాడన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి అతని నుండి 2లక్షల విలువచేసే విగ్రహాలను స్వాధీనం చేసుకున్నామని డిఎస్పీ చెప్పారు. ఈ సమావేశంలో సిఐ మంగారావు, ఎస్ఐలు వేణు, బషీర్‌లు కూడా పాల్గొన్నారు.

## మన చరిత్ర తెలుసుకుందాం

జిల్లాలో ప్రసిద్ధి చెందిన చారిత్రాత్మక గ్రామాల విషయాలపై భావితరాల వారికి తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా వుందని జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం నెల్లూరు జిల్లా పరిషత్ సమావేశంలో మనకు తెలియని మన చరిత్ర పుస్తకా విష్కరణ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ జిల్లాలో చారిత్రాత్మకంగా పూర్వీకులు సాధించిన విషయాలపై అలాగే ఆయా గ్రామాలలో సాంస్కృతిక సాంప్రదాయాల గురించి, గ్రామీణ ఆటలు తదితర చరిత్రకెక్కే అంశాల గురించి భావితరాల వారికి తెలియజేసి వారి అనుభవాల నుండి పాఠాలు నేర్చుకొనేలా చూడాలన్నారు. అలాగే గత వైభవాల గురించి, పతనాలు గురించి సాధించిన విజయాల గురించి తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా సి.వి.కృష్ణయ్య రచించిన "మనకు తెలియని మన చరిత్ర" పుస్తకాన్ని ఆవిష్కరించారు. శాసన మండలి సభ్యులు విఠపు బాలసుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించి మాట్లాడుతూ జిల్లాలో మనకు తెలియని చారిత్రాత్మక గ్రామాలున్నాయని, అటువంటి చరిత్రగలిగిన గ్రామాల గురించి, పట్టణాల గురించి భావితరాల వారు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజాపరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి వీరభద్రయ్య, పుస్తకగ్రంథకర్త సి.వి.కృష్ణయ్య, జన విజ్ఞానవేదిక సభ్యులు చంద్ర రాజగోపాల్, ఎన్.శంకరయ్య, కాళిదాసు పురుషోత్తమరావు తదితరులు పాల్గొన్నారు.

## షిండే చేతులు పట్టుకున్న కేసీఆర్

శ్రీను గల్పిక

అది గ్యాంగ్ రేప్‌ల రహిత నగరంగా ఐక్య రాజ్యసమితి భద్రతా మండలి గుర్తింపు పొందిన ఢిల్లీ మహానగరం. ఆ నగరంలో కేంద్ర హోం శాఖ మంత్రి సుశీల్‌కుమార్ షిండే ఛాంబర్. ఆరోజు డిసెంబర్ 28వతేదీ... తెలంగాణ అంశంపై అఖిలపక్ష సమావేశం జరుగుతుం దక్కడ. ముందు షిండే, కేంద్ర హోంశాఖ కార్యదర్శి వచ్చారు. అప్పుడే అక్కడకు కాళేశ్వరి ట్రావెల్స్ వోల్వో బస్సు వచ్చింది. అందులో నుండి సర్‌ఛార్జ్ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు కె.ఆర్.సురేష్‌రెడ్డి, గాదె వెంకటరెడ్డి, తెలుగుదేశం నాయకులు కడియం శ్రీహరి, యనమల రామకృష్ణుడు, టీఆర్ఎస్ నాయకులు కేసీఆర్, నాయిని నర్సింహారెడ్డి, వైయస్సార్ కాంగ్రెస్ నాయకులు యం.వి. మైసూరారెడ్డి, మహేందర్‌రెడ్డి, బీజేపీ నాయకులు కిషన్‌రెడ్డి, హరిబాబు, సీపీఎం నాయకులు బి.వి. రాఘవులు, జూలకంటి రంగారెడ్డి, సీపీఐ నాయకులు కె.నారాయణ, గుండా మల్లేష్, ఎంఐఎం నాయకులు అసదుద్దీన్ ఓవైసీ, జి.వి.జి. నాయుడులు దిగారు. తెలంగాణ, సీమాంధ్ర నాయకులు ఒకే బస్సులో నుండి దిగడం చూసి షిండే ఆశ్చర్యపోయారు. ఇదేంటి కిరణ్... మీరంతా కలసి ఎయిర్‌పోర్టు నుండి బస్సులో వస్తున్నారా అని అడిగాడు. అందుకు కిరణ్... మేం ఢిల్లీ ఎయిర్‌పోర్టు ... కాద్సార్, ఏకంగా హైద్రాబాద్ నుండే ఈ బస్సులో వచ్చాం... రాత్రంతా ప్రయాణమే... ఒళ్లంతా ఒకటే నొప్పులు అని అన్నాడు. దానికి షిండే ఇంకా ఆశ్చర్యపోతూ... రాత్రంతా సీమాంధ్ర, తెలంగాణ నాయకులు కలిసే ప్రయాణం చేశారా? మీరు ఇంత కలుపుగోలుగా వున్నప్పుడు మరి ప్రత్యేక రాష్ట్రాలెందుకు? దాని కోసం ఈ గొడవలెందుకని ప్రశ్నించాడు. అప్పుడు కేసీఆర్ అందుకుని... ఇవన్నీ మా కోసమా సార్... జనం కోసం చేస్తున్నాం... మేం రాజకీయంగా బ్రతకడం కోసం చేస్తున్నాం అని అన్నాడు. ముందు మీరు స్నానాలు చేసి టిఫిన్ కానిచ్చేయండి... ఆ తర్వాత కూర్చుని తెలంగాణ మీద తీరిగ్గా మాట్లాడుకుందాం అని షిండే చెప్పాడు. యనమల రామకృష్ణుడు వుండి... బయట మీకేమన్నా పనులుంటే చూసుకుని రండి సార్... ఆ వైద్య విద్యార్థిని గ్యాంగ్‌రేప్ గురించి చూడండి. ఆ నిందితులకు కఠినశిక్షలు పడేలా చేయండి.. ఈ అఖిలపక్షం అంటారా... మా వారసులు కూడా వచ్చి ఈ చర్చల్లో పాల్గొంటూనే వుంటారు. మీరెళ్లండి... మేం అలావెళ్లి ఎర్రకోట, ఇండియా గేటు, తాజ్‌మహల్ చూసొస్తాం అని చెప్పాడు. సరే, మీ ఇష్టం... మీ పనులన్నీ అయ్యాక ఫోన్ చేస్తే వచ్చి మాట్లాడుతానని చెప్పి షిండే వెళ్లిపోయాడు. తెలుగుదేశం, కాంగ్రెస్, వైయస్సార్ కాంగ్రెస్ నాయకులు ఢిల్లీలో చారిత్రాత్మక ప్రదేశాలను చూసొద్దామని వెళ్లిపోగా, కిరణ్ సోనియా దర్శనం కోసం టెన్‌జనపథ్‌కు వెళ్లాడు. బీజేపీ, సీపీఎం, సీపీఐ నాయకులు ఢిల్లీలో వున్న వాళ్ల పార్టీ కార్యాలయాలకు వెళ్లారు. ఎంఐఎం వాళ్లు మాత్రం ఆంధ్రాభవన్‌కు చేరుకున్నారు.

★★★★★

అది టెన్‌జనపథ్. సోనియాగాంధీ, మన్మోహన్‌సింగ్‌లు తెలంగాణ గురించి చాలా సీరియస్‌గా చర్చిస్తున్నారు. అంతలో షిండే అక్కడకు వచ్చాడు. ఆయన్ను చూస్తూనే సోనియా ఆశ్చర్యపోయి... అదేంటి నువ్విక్కడకు వచ్చావు. అక్కడ తెలంగాణ మీద అఖిలపక్షం ఏర్పాటు చేసాం కదా. అభిప్రాయాలు కుదరక అందరూ సమావేశం బాయ్‌కాట్ చేసి వెళ్లిపోయారా అని అడిగింది. దానికి షిండే... అక్కడ అంత సీన్ లేదమ్మా... తెలంగాణ మీద మనం ఎంత ... సమావేశం నిర్వహించామో, వాళ్లూ అంతే మొక్కుబడిగా ఈ సమావేశానికి వచ్చారు. వచ్చినవాళ్లంతా సాయంత్రం మాట్లాడుకుందామని చెప్పి షాపింగ్ కోసం, ఢిల్లీని విజిట్ చేయడం కోసం వెళ్లారు అని చెప్పాడు. అలాగయితే సాయంత్రం ఒకసారి అందరితో మాట్లాడి పంపించేయండి అని సోనియా సలహా ఇచ్చింది.

★★★★★

షిండే ఫోన్ చేయడంతో అఖిలపక్ష సమావేశానికి వచ్చిన నాయకులందరూ ఆయన ఛాంబర్‌కు చేరుకున్నారు. కే... మాత్రం షిండే గది ముందు క్రింద కూ... తెలంగాణ ఇస్తేనే గాని నేను స... శంలో పాల్గొననంటూ భైఠాయించాడు. ఆయనతో పాటు నాయిని నర్సింహారెడ్డి కూడా కూర్చున్నాడు. ఎలాగూ సమావేశంలో చర్చిస్తున్నాం కదా, అందరి అభిప్రాయాలు ... ఒక నిర్ణయం ప్రకటిస్తాం అని చెప్పాడు. దాంతో కేసీఆర్, నాయినిలు శాంతించి సమావేశంలో కూర్చున్నారు. మొదట కుశలప్రశ్నలు మొదలయ్యాయి. షిండేకు అఖిలపక్ష నాయకులకు మధ్య యోగక్షేమాలు, కుటుంబ సభ్యులు, వారేమి చేస్తున్నారు వంటి అంశాల మీద చర్చ జరిగింది. హైదరాబాద్ బిర్యానీ, ఛార్మినార్, గోల్కొండ వంటి వాటి గురించి షిండే మాట్లాడితే, కేంద్ర హోంమంత్రిగా వచ్చాక దేశంలో రేప్‌లు తగ్గాయని, దేశం సుఖశాంతులతో వర్ధిల్లుతుందని మన నాయకులు కితాబిచ్చారు. అలా సరదా కబుర్లతో సాయంత్రమైంది. అప్పుడు షిండే ఏదో గుర్తుకు వచ్చినట్లు... అసలు మిమ్మల్ని పిలిపించిన విషయమే మరచిపోయాను... తెలంగాణ విషయం మీద మీ అభిప్రాయమేంటో చెప్పండి అని అడిగాడు. అప్పుడు వీళ్లు కూడా నాలిక్కరుచుకుని... అరెరె అసలు ఆ విషయమే మరచిపోయాం సార్.. అయినా కొత్తగా చెప్పే అభిప్రాయమేముంది... అరిగిపోయిన రికార్డులా మా పాత రికార్డులు వున్నాయిగా, వాటినే కొత్తవిగా మార్చుకోండి అని కోరారు. ఒక్క నిముషంలో ఆ సబ్జెక్ట్ పూర్తయ్యింది. అప్పుడు షిండే... మీ అభిప్రాయాలన్నీ ప్రధాని మన్మోహన్‌సింగ్, సోనియాగాంధీల దృష్టికి తీసుకుపోతాను... ఒక నెలలో తెలంగాణకు పరిష్కారం చెబుతాను అని అన్నాడు. ఆయన నోటిలో నుండి ఆ మాట పూర్తయ్యేలోపే.. 'ఆపండి' అంటూ కేసీఆర్ ఆవేశంగా లేచాడు. ఆయన ఆగ్రహంతో ఊగిపోతూ... ఎన్ని నెలలు వాయిదావేస్తార్సార్... నెల నెల అంటూ సంవత్సరాలు సాగదీస్తున్నారని అడిగాడు. కేసీఆర్ ఆవేశం చూసి... ఇతను షిండే మీదే కాదు, మనమీద కూడా దాడిచేసేటట్లున్నాడని భయపడి మిగతా నాయకులు బయటకు పరుగులు తీసారు. వీళ్లంతా బయటకు పోగానే కేసీఆర్ కూల్ అయ్యాడు. షిండే మాత్రం ఆయన దెబ్బకు భయపడి వణుకుతున్నాడు. వెంటనే కేసీఆర్ వేగంగా వెళ్లి షిండే చేతులు పట్టుకున్నాడు. ప్లీజ్ నన్ను కొట్టొద్దు... మీకు తెలంగాణ ఇచ్చేస్తాను అని షిండే అంటుంటే... అప్పుడు కేసీఆర్, సార్ ఇవి చేతులు కాదు, ఇంకొకటి అనుకోండి... నెలరోజుల్లో తెలంగాణను పరిష్కరిస్తామన్నారు... ఆ మాటను వెనక్కి తీసుకోండి... మీరు తెలంగాణను పరిష్కరిస్తే మా గతేం కావాలి. మా రాజకీయ బ్రతుకులు ఏం కావాలి. ఏదో ఆ తెలంగాణ పేరు చెప్పుకుని కాలం వెళ్లదీస్తున్నాం. దయచేసి తెలంగాణ ఇచ్చే ప్రయత్నం మాత్రం చేయవద్దు అని బ్రతిమలాడుకోసాగాడు. కేసీఆర్ పరిస్థితి షిండేకు అర్థమై... బొచ్చుకు లేని జిల షేడ్‌కెందుకు? అలాగేలే అని హామీ ఇచ్చాడు. కేసీఆర్ అక్కడనుండి హ్యాపీగా బయటకు వచ్చాడు. బయట మాత్రం మిగతా నాయకుల ముందు ఫోజిస్తూ... ఒక నెలలో తెలంగాణను తేల్చకపోతే తలలు తెగుతాయి... రక్తం ఏరులై పారుతుంది అని కేకలు వేయసాగాడు.

## గర్భిణీలకు నేస్తం...అమృత హస్తం

రాష్ట్ర ప్రభుత్వం గర్భిణీస్త్రీలకు, బాలింతలకు వినూత్నరీతిలో ప్రవేశపెట్టిన ఇందిరమ్మ అమృతహస్తం కార్యక్రమం పటిష్టంగా అమలుచేసేందుకు తగిన ప్రణాళికలు రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మిన్నీ మాథ్యూస్ పేర్కొన్నారు.

బుధవారం జిల్లా కలెక్టర్లతో ఇందిరమ్మ అమృతహస్తం కార్యక్రమంపై వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించి పలు సూచనలు, సలహాలిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా జనవరి 1నుండి ప్రారంభించిన ఇందిరమ్మ అమృతహస్తం కార్యక్రమం ఎలాంటి సమస్యలు లేకుండా సమర్థవంతంగా అమలుచేసి విజయవంతం చేయాలన్నారు. ప్రతి జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల వారీగా గర్భిణీస్త్రీలను, బాలింతలను నమోదుచేసి, వారికి అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ప్రతిరోజూ మధ్యాహ్న భోజనాన్ని అందించే విధంగా కార్యక్రమం నిర్వహించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం గ్రామస్థాయిలో పర్యవేక్షించేందుకు పొదుపు గ్రూపు సభ్యుల అధ్యక్షతన అంగన్‌వాడీ కార్యకర్త, ఆశ కార్యకర్తల సభ్యులతో కమిటీని ఏర్పాటు చేయాలని ఈ కమిటీ లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఇందిరమ్మ అమృతహస్తం గురించి తెలియజేసి అంగన్‌వాడీ కేంద్రాలకు హాజరయ్యేలా చూడాలన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ బి.శ్రీధర్, జేసీ బి.లక్ష్మీకాంతం


ఈ కార్యక్రమం స్త్రీ, శిశుసంక్షేమశాఖ, గ్రామీణాభివృద్ధి, జిల్లా నీటి నిర్వహణ సంస్థ, పౌరసరఫరాలు మరియు గిరిజనాభివృద్ధి సంస్థ శాఖల అధికారుల సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించాలన్నారు.

ఈ సమావేశంలో జిల్లా కలెక్టరు బి.శ్రీధర్, జాయింట్‌కలెక్టర్ బి.లక్ష్మీకాంతం, ఐ.సి.డి.ఎస్ పి.డి విజయలక్ష్మి, డి.యం.అండ్.హెచ్.ఓ డా॥ మాశిలామణి, డిఆర్‌డిఎ పి.డి వెంకటసుబ్బయ్య, ఐ.సి.డి.ఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

PDF Compressor Free Version



## మేషం



అశ్వని, భరణి, కృత్తిక 1 పాదము

వృత్తిపరంగాను, వ్యాపారరంగాలలో మంచి అభివృద్ధి ఉండి ఆదాయము పెరుగుతుంది. పనులు, కార్యక్రమాలు, తలచినరీతిలో జరుగుతున్నను ఎక్కువ టెన్షన్ పడుతుంటారు. ఉద్యోగులకు అదనపు బాధ్యతలు, అధికారవర్గంతో మైత్రి బాగుంటుంది. వర్కర్లతో యజమానులకు సమస్యలుంటాయి. షేర్లు, స్థిరాస్తులపై ఆదాయం పెరగడం, పెట్టుబడి రంగాలలో మదుపుచేయడం ఉంటుంది.

## వృషభం



కృత్తిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర్ష1, 2పాదాలు

దైవ, సమాజకార్యక్రమాలలో ఆసక్తి చూపుతారు. వృత్తిపరంగా వ్యాపకాలు, పలుకుబడి పెరుగుతుంది. వ్యాపారరంగంలో పోటీతత్వం పెరిగి, క్రొత్త పెట్టుబడులకు, వ్యాపార భాగస్వామ్యాలకు ప్రయత్నిస్తారు. మీ లోపాలను సరిదిద్దుకొని కొత్త నిర్ణయాలు చేపట్టుతారు. సహచరులు, అధికారుల ప్రశంసలు ఉద్యోగులకు లభిస్తాయి. మరియు బాధ్యతలు పెరుగుతాయి.


## మిథునం



మృగశిర్ష 3,4 పాదాలు, ఆర్థ, పునర్వసు 1, 2, 3పాదాలు

వృత్తి ఉపాధి ప్రయత్నాలలో మంచి అభివృద్ధి, వ్యాపారపరంగా ఆదాయం పెరగడం ఉంటుంది. దూరప్రాంతాల నుండి ఆహ్వానాలు అందుకోనడం, ప్రముఖులతో పరిచయాలుంటాయి. క్రొత్త గృహోపకరణాలు, విలాస వస్తువులుకొంటారు. శుభకార్య తేదీలు వాయిదా పడతాయి. ఉద్యోగులకు పనిభారం ఉంటుంది మరియు అధికారులు పబ్లిక్‌తో సమస్యలు ఏర్పడవచ్చును.


## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వృత్తి వ్యాపారాలలో ఆశించిన అభివృద్ధి ఉండదు. ఖర్చులను అదుపుచేయలేరు. ఆదాయం తగ్గుతుంది. మొగమాటం, లౌక్యం లేకుండా వ్యవహరిస్తే ఇబ్బందులలోపడతారు. సమావేశాలలో మీ సూచనలు సలహాలపై విమర్శనలుంటాయి. బంధువర్గంలోను, కుటుంబలోనూ అనారోగ్య బాధితులుంటారు. చేపట్టిన పనులు మార్పులు, చేర్పులు చేసుకొనవలసిన స్థితి ఉంటుంది.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

అనుకున్న పనులు మరొక రకంగా మారి గందరగోళం సృష్టిస్తాయి. ఉద్యోగులకు స్థానమార్పులు, కీలక బాధ్యతలు స్వీకరించడం ఉంటుంది. ఆడంబరాలకు, సౌకర్యాలకు ఖర్చులు పెరుగుతాయి. వృత్తిపరంగా ఆర్థిక స్థితి సుమారుగా ఉంటుంది. అవసరాలకు కొంత ఋణం చేయడం జరుగుతుంది. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. ఆరోగ్యం బాగుంటుంది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఆర్థిక వనరుల అభివృద్ధికి, వ్యాపారంలో పెరుగుదలకు మీ శ్రమ ప్రయత్నాలు ఫలించడం ప్రారంభం కాగలదు. ఆదాయం పెరుగుతుంది. కుటుంబ నిర్ణయాలు కొన్నిటిలో మీకు అనుకూలత సరిగా ఉండదు. షేర్లు స్థిరాస్తులపై ఆదాయం బాగుంటుంది. శుభకార్య ప్రయత్నాలు నెరవేరుతాయి. శుభకార్యాలు, దైవకార్యాలలో పాల్గొంటారు. కొద్దిగా శరీరం నలతగా ఉంటుంది.

## రాశి - మీ వాసి



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

తేది. 04.01.2013 నుండి
తేది. 10.01.2013 వరకు.

ఈ వారం మేషంలో కేతువు, వృషభంలో గురువు, తులలో శనిరాహువులు, ధనుస్సులో రవి, బుధ, శుక్రులు, మకరంలో కుజుడు, కన్యతుల వృశ్చిక ధనురాశులలో చంద్రుడు సంచరిస్తారు.

పంచాంగము :
ముహూర్తములు:
ముహూర్తములు ఈ వారంలో లేవు.

### మార్గశీర్షమాస కృష్ణ పక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 04 | శుక్ర | సప్తమి | సా॥ గం.6.11వ॥ |
| తేది. 05 | శని | అష్టమి | సా॥ గం.4.48వ॥ |
| తేది. 06 | ఆది | నవమి | సా॥ గం.3.03వ॥ |
| తేది. 07 | సోమ | దశమి | ప॥ గం.1.05వ॥ |
| తేది. 08 | మంగళ | ఏకాదశి | ఉ॥ గం.10.52వ॥ |
| తేది. 09 | బుధ | ద్వాదశి | ఉ॥ గం.8.34వ॥ |
| | పిదప | త్రయోదశి | పూర్తిగా |
| తేది. 10 | గురు | చతుర్దశి | రా॥ గం.3.47వ॥ |


## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

గృహోపకరణాలు, విలువైన వస్తువుల కొనుగోలు ఖర్చులుంటాయి. ఆదాయం ఖర్చులు సరిపోతుంటాయి. వ్యాపారపరంగా అవకాశాలు, వ్యాపార విస్తరణ జరుగుతుంది. రావలసిన బాకీలు స్వల్పంగా ముట్టతాయి. ప్రభుత్వముకు చెల్లింపులు సకాలంలో చేస్తారు. ఉద్యోగులకు అధికారులకు మధ్య అవగాహన బాగుంటుంది. దూర ప్రయాణాలు నిర్ణయంకావడం ఉంటుంది.


## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

వృత్తి ఉద్యోగాలలో అనుకూలమగు మార్పులుండగలవు. వ్యాపారవర్గాలకు విస్తరణకు, పెట్టుబడులకు అవకాశాలు లభించగలవు. పరిశ్రమల యజమాన్యాలకు, కాంట్రాక్టర్లకు క్రొత్త అవకాశాలు, ఏజన్సీలు లభించవచ్చును. వర్కర్లతో మాత్రము జాగ్రత్తగా మెలగండి. ఆరోగ్యం కూడా అంతగా అనుకూలించదు. ఇంతకు ముందు ఇబ్బందిపెట్టిన పనులు, సన్నివేశాలు పరిష్కారమవుతాయి.


## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

పెద్ద మొత్తాలలో ఆర్థిక లావాదేవీలు చేపట్టవద్దు. వృత్తి ఉద్యోగాలలలో గుర్తింపు బాగుంటుంది. కళాక్రీడా సాంకేతిక, విజ్ఞానరంగాల వారికి విదేశ ప్రయాణాలు, ఉద్యోగావకాశాలు బాగుంటుంది. పరిశ్రమలు, వ్యాపార వర్గాలకు ఆదాయం పెరుగుతుంది. మంచి పురోభివృద్ధి సాధిస్తారు. శుభకార్యాల తేదీలు నిర్ణయంకావడం, దూరప్రయాణాలు నిర్ణయంకావడం జరుగుతుంది.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఆర్థికపరమైన ఇబ్బందులుంటాయి. డబ్బు సర్దుబాటుకు కొద్ది శ్రమపడతారు. వృత్తి నిర్వహణలో స్తబ్దత, వ్యాపారవర్గాలకు అవకాశాలు చేజారిపోవడం ఉంటుంది. వ్యాపార పోటీలో వెనుకబడతారు. ప్రభుత్వ కార్యాలయాలలో పనులు అనుమతులు ఆలస్యంకాగలవు. ప్రలోభాలకు దూరంగా ఉండండి. ఆత్మీయబంధువులకు అనారోగ్య సమస్యలుంటాయి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

క్రయవిక్రయాలు లాభిస్తాయి. వ్యాపారరంగంలో పురోభివృద్ధిలో సాగుతూ ఆదాయం పెంచుకుంటారు. క్రొత్తపెట్టుబడులు, నిర్మాణాలకు బ్యాంకు ఋణాలు, ప్రభుత్వ అనుమతులు దొరకగలవు. శరీరానికి గాయాలు తగిలే అవకాశమున్నది. సోదరవర్గంతో విభేదాలు తలఎత్తగలవు. వృత్తి సమర్థవంతంగా పూర్తిచేస్తారు. కమిటీ సమావేశాలలో మీ ఆలోచనలను సమర్థిస్తారు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఆర్థికంగా బాగుంటుంది. కుటుంబసభ్యులలో చిరు భేదాభిప్రాయాలుండి సర్దుబాటుకాగలవు. వృత్తిపరంగా సంతృప్తి, వ్యాపారపరంగా అభివృద్ధి అవకాశాలు బాగుండి ఆదాయం పెరుగుతుంది. దూరప్రయాణాలుంటాయి. అనుకున్న పనులు సక్రమంగా జరుగుతున్నా టెన్షన్ పడుతుంటాయి. బంధుముఖ్యులకు వీడ్కోలు చెప్తారు. దైవకార్యాలు నిర్వహించాలనే నిర్ణయం తీసుకుంటారు.

# పక్షుల పండుగని జయప్రదం చేద్దాం

జిల్లాలో సూళ్లూరుపేట వద్ద నిర్వహిస్తున్న ఫ్లెమింగో పక్షుల పండుగను అత్యంత వైభవంగా పండుగ వాతావరణంలో నిర్వహించి విజయవంతం చేయాలని రాష్ట్ర ఆర్థికశాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు.

ఆదివారం నెల్లూరు హరిత టూరిజం హోటల్‌లో ఫ్లెమింగోఫెస్టివల్ నిర్వహణపై పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఫ్లెమింగో పక్షుల పండుగ జనవరి, 8,9,10తేదీలలో జరిపేందుకు నిర్ణయం తీసుకోవడం జరిగిందని, ఈ పండుగను ప్రతి సంవత్సరం జనవరి, 7,8,9తేదీలలో జరిగేలా ప్రభుత్వ క్యాలెండర్లో పొందుపరిచి తగిన ఉత్తర్వులు కూడా జారీచేయడం జరిగిందన్నారు. ఈ ఫ్లెమింగో ఫెస్టివల్‌కు మన జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాల నుండి, రాష్ట్రాల నుండి సందర్శకులు వచ్చే అవకాశం వున్నందున వారికి అవసరమైన సదుపాయాలను సక్రమంగా ఏర్పాటు చేసేందుకు జిల్లాస్థాయి అధికారుల సమన్వయంతో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి సమర్థవంతంగా ఎలాంటి సమస్యలు లేకుండా నిర్వహించాలన్నారు. అందులో భాగంగా సూళ్లూరుపేట పట్టణాన్ని పురపాలక పట్టణంగా ప్రభుత్వం ప్రకటించిన సందర్భంగా 2కోట్లు పట్టణ అభివృద్ధికి మంజూరుచేయడం జరిగిందని అందులో 50లక్షలు పురపాలక ఆఫీసు భవననిర్మాణానికి, 1.50కోట్లు రోడ్లు, డ్రైన నిర్మాణాలకు కేటాయించడం జరిగిందన్నారు. అలాగే త్రాగునీటి సరఫరాకు అదనంగా 1.50కోట్లు విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జాతీయ రహదారి నుండి సూళ్లూరుపేట పట్టణాన్ని కలిపే కాళంగినదిపై బ్రిడ్జిని నిర్మించేందుకు 8కోట్ల నిధులు మంజూరుచేసేందుకు ప్రతిపాదనలు పంపడం జరిగిందని, త్వరలో ఆ నిధులు విడుదల చేయడం జరుగుతుందన్నారు. సూళ్లూరుపేట పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేకంగా కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ప్రత్యేక నిధుల నుండి 10కోట్లు మంజూరుచేయడం జరిగిందని, దీంతో పట్టణంలోని ప్రభుత్వ స్థలాలలో పార్కులు, తదితర పర్యాటక రంగ అభివృద్ధి నిర్దేశించిన మౌలిక సదుపాయాలు ఏర్పాటుచేయడం జరుగుతుందన్నారు. తొలుత మంత్రి ఫ్లెమింగో ఫెస్టివల్ ప్రచార శకటాన్ని ప్రారంభించారు. అలాగే ఫ్లెమింగో ఫెస్టివల్‌కు సంబంధించిన కరపత్రాలు, పోస్టర్లు విడుదల చేశారు.

ఈ సమావేశంలో సూళ్లూరుపేట శాసనసభ్యులు పరసా రత్నం, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, నెల్లూరు సిటీ శాసనసభ్యులు ముంగమూరు శ్రీధర కృష్ణారెడ్డి, జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్, జాయింట్ కలెక్టర్ బి.లక్ష్మీకాంతం, డి.ఆర్.ఓ బి.రామిరెడ్డి, నెల్లూరు ఆర్.డి.ఓ మాధవీలత, ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహణ ప్రత్యేకాధికారి రవిప్రకాష్, కార్పొరేషన్ కమీషనర్ టి.యస్.ఆర్.ఆంజనేయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### జాతీయ చదరంగ పోటీలో
# నెల్లూరుకు 'బంగారం'

జాతీయ స్కూల్‌గేమ్స్ చదరంగ పోటీల్లో అండర్-17 విభాగంలో నెల్లూరు క్రీడాకారులైన కె.మనోజ్ కుమార్ బంగారు పతకం, అండర్-14 విభాగంలో వి.పృధ్వీకుమార్ కాంస్యపతకంలు సాధించారు. వీరిని డిసెంబర్ 30న నెల్లూరులోని టూరిజం హోటల్ హరితలో రాష్ట్ర ఆర్థికమంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, జిల్లాకలెక్టర్ బి.శ్రీధర్‌లు అభినందించారు. కార్యక్రమంలో క్రీడాభివృద్ధి అధికారి ఆర్కే ఎతిరాజ్, చెస్ అసోసియేషన్ జిల్లా ప్రధానకార్యదర్శి వై.సుమన్ తదితరులు పాల్గొన్నారు.




వధువు కావలెను — పెళ్లి సంబంధాలు — వరుడు కావలెను



1. 1982 జూన్ 8 జననం. ఎత్తు 5'11". చదువు బి.టెక్. ఉద్యోగం విప్రో, ప్రస్తుతం ఐ.టి.సి బెంగుళూరు. జీతం నెలకు 1లక్ష ఆస్తివిలువ 6కోట్లు. ఉన్నతమైనరెడ్డి వ్యాపారకుటుంబం. స్వస్థలం గుంటూరుజిల్లా.
2. 1982 జూన్ 17 జననం. ఎత్తు 5'10". చదువు బి.టెక్. యం.యస్(బోస్టన్ యూనివర్శిటీ), కొలంబియా. ఉద్యోగం క్రెడిట్ స్విస్ బ్యాంకు(న్యూయార్క్) అసోసియేటెడ్ వైస్ ప్రెసిడెంట్ 7సం॥ల నుండి జీతం 1.50డాలర్లుసం॥నకు. ఉన్నతమైనరెడ్డి ఉద్యోగకుటుంబం. ఆస్తివిలువ 10కోట్లు. స్వస్థలం వరంగల్‌జిల్లా. ప్రస్తుతనివాసం హైదరాబాద్.
3. 1985 అక్టోబరు 6 జననం. ఎత్తు 5'8". చదువు బి.టెక్(వైజాగ్). ఉద్యోగం మహీంద్ర సత్యమ్. జీతం నెలకు 90,000/-(స్విట్జర్‌లాండ్). ఆస్తివిలువ 40లక్షలు(వైజాగ్). ఉన్నతమైనరెడ్డి కుటుంబం. స్వస్థలం వైజాగ్.
4. 1984 జూన్ 18 జననం. ఎత్తు 5'11". చదువు బి.ఇ(చెన్నై). యం.యస్(కంప్యూటర్స్), సింగపూర్. ఉద్యోగం సింగపూర్ ప్రెస్‌హోల్డింగ్స్-సింగపూర్. ఆస్తివిలువ 10కోట్లు. ఉన్నతమైనరెడ్డి ఉద్యోగకుటుంబం. స్వస్థలం నెల్లూరుజిల్లా. ప్రస్తుతనివాసం చెన్నై.
5. 1985 మే 14 జననం. ఎత్తు 6". చదువు బి.టెక్, యం.యస్. ఉద్యోగం జె.పిమోర్గాన్. న్యూజెర్సీ. జీతం సం॥నకు లక్ష డాలర్లు. స్వస్థలం చిత్తూరుజిల్లా. ఉన్నతమైనరెడ్డి వ్యాపారకుటుంబం. ఆస్తివిలువ 10కోట్లు.
6. 1985 ఏప్రిల్ 20 జననం. ఎత్తు 5'3". చదువు బి.టెక్(ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్). స్వస్థలం నెల్లూరుజిల్లా ఉన్నతమైనరెడ్డి మధ్య తరగతి కుటుంబం. ఆస్తివిలువ 60లక్షలు.
7. 1987 ఫిబ్రవరి 17 జననం. ఎత్తు 5'5". చదువు యం.సి.ఎ. ఉద్యోగం విజయడైరీ, నెల్లూరు. జీతం నెలకు 10,000/-. ఆస్తివిలువ 20లక్షలు. మంచి మధ్యతరగతి రెడ్డికుటుంబం. స్వస్థలం నెల్లూరుజిల్లా.
8. 1980 ఏప్రిల్ 28 జననం. ఎత్తు 5'4". చదువు యం.బి.బి.యస్. వరంగల్. ఉద్యోగం కార్డియోథొరాసిక్ డిపార్ట్‌మెంట్. మెడిసిటి హాస్పిటల్, హైదరాబాద్. ఆస్తివిలువ 2కోట్లు. ఉన్నతమైనరెడ్డి వ్యాపారకుటుంబం. స్వస్థలం కడపజిల్లా. ప్రస్తుతనివాసం. హైదరాబాద్.
9. 1986 మే 15 జననం. ఎత్తు 5'91/2". చదువు బి.టెక్(కంప్యూటర్స్). ఉద్యోగం బెంగుళూరు. ఉన్నతమైనరెడ్డి వ్యవసాయకుటుంబం. ఆస్తివిలువ 11/2కోటి. స్వస్థలం నెల్లూరుజిల్లా.
10. 1987 ఫిబ్రవరి 27 జననం. ఎత్తు 5'6". చదువు బి.ఇ. ఉన్నతమైనరెడ్డి వ్యాపారకుటుంబం. ఆస్తివిలువ 3కోట్లు. స్వస్థలం నెల్లూరుజిల్లా.

వివరాలకు: కొండూరు హరినారాయణరెడ్డి, 25-9-413. పోస్టల్‌కాలనీ, ఆంధ్రకేసరినగర్, నెల్లూరు - 4.

98480 34522
94406 39460.

ఫోస్ట్‌బాక్స్ నెం.4, C/o. లాయర్ జాతీయ తెలుగు వారపత్రిక, ప్లాట్ నెం. 1 & 2. మెయిన్‌రోడ్డు, మాగుంట లే-అవుట్, నెల్లూరు - 3.

PDF Compressor Free Version



## మూ 'వీ' క్షణం









### కెమిస్ట్రీని నమ్మను

'జర్నీ' సినిమాతో తానేంటో నిరూపించుకున్న అంజలి 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' సినిమాలో సీనియర్ హీరో వెంకటేష్ సరసన నటించింది. నటీనటుల మధ్య కెమిస్ట్రీ, ఫిజిక్స్‌లను తాను నమ్మనని, సీనియర్‌నటులతో కలిసి నటించడానికి తనకు ఎలాంటి అభ్యంతరంలేదని అంజలి చెబుతుంది.

### కమల్‌తో రాజమౌళి

'విశ్వరూపం' ఆడియో విడుదల కోసం హైదరాబాద్‌కు వచ్చిన కమల్‌హాసన్‌ను దర్శకుడు రాజమౌళి కలిసారు. అంతేకాదు, మాటీవీ కోసం కమల్‌హాసన్‌ను రాజమౌళి ఇంటర్వ్యూ చేసి పలు అంశాలు రాబట్టారు.

### 'రాయల్' ప్రిన్స్



ఈమధ్య సినిమా హీరోలు సినిమాల్లో కంటే కూడా వాణిజ్య ప్రకటనల్లో ఎక్కువుగా నటిస్తున్నారు. గతంలో థమ్స్‌అప్ ప్రకటనలో నటించిన ప్రిన్స్ మహేష్‌బాబు తాజాగా మద్యం కంపెనీ 'రాయల్ స్టాగ్' యాడ్‌లో నటిస్తున్నారు. ఈ ప్రకటనలోని ఫస్ట్ లుక్కే... పక్కనున్న మహేష్ ఫోటో.

## డివిజన్ గూడూరు వార్తలు

## సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంలేదు

### -- సబ్ కలెక్టర్‌కు బాధితుల మొర --



సబ్ కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న బాధితులు

ఏళ్ల తరబడి సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంలేదు, కనీసం మీరైనా కనికరించి సమస్యల పరిష్కారానికి చొరవచూపాలని పలువురు బాధితులు సబ్ కలెక్టర్ నివాస్‌కు మొరపెట్టుకున్నారు. గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజావిజ్ఞప్తుల దినం జరిగింది. పలు మండలాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి తమ సమస్యలను సబ్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. చిట్టమూరు మండలం గునపాడు గ్రామానికి చెందిన పద్మజకు నాయుడుపేట మండలం అన్నమేడు వద్ద ప్రభుత్వం మంజూరుచేసిన అసైన్‌మెంట్ భూమి ఉందని, రెండేళ్ల కిందట నరకు తామే సాగుచేసుకుంటుండగా కొందరు దౌర్జన్యంగా ఈ భూమిని ఆక్రమించేశారని బాధితురాలు సబ్ కలెక్టర్ ఎదుట వాపోయింది. స్థానిక అధికారులకు విషయం తెలిపినా వారు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తంచేసింది.

## చిన్నారిని చంపేసారు



చిన్నారి మృతదేహం

గూడూరు మండలం సంతదాసుపల్లిలో పసికందు మృతదేహాన్ని సోమవారం పోలీసులు, రెవెన్యూ అధికారులు, గ్రామస్తుల సమక్షంలో వెలికితీశారు. పోలీసుల కథనం మేరకు సంతదాసుపల్లి గ్రామానికి చెందిన శీనయ్య భార్యపై అనుమానంతో 8నెలల మగబిడ్డను శనివారం నేలకేసి బాది చంపాడు. అనంతరం కుటుంబసభ్యులు మృతదేహాన్ని పూడ్చిపెట్టారు. అయితే కన్నతల్లి కడుపుకోతతో పోలీసులను ఆదివారం ఆశ్రయించి తనకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదుచేసింది. డీఎస్పీ కె.సురేష్‌కుమార్ నేతృత్వంలో పోలీసులు ఆదివారం గ్రామానికి వెళ్ళి విచారణ నిర్వహించి వివరాలు సేకరించారు. అనంతరం శీనయ్యను అదుపులోకి తీసుకున్నారు. సోమవారం తహసీల్దారు మైత్రేయ, సిఐ వేమారెడ్డి, సీడిపిఓ ప్రమీలారాణి అక్కడికి వెళ్ళి మృతదేహాన్ని వెలికితీశారు. మృతదేహానికి వైద్యురాలు ఉషానాయర్ పోస్టుమార్టం చేశారు. కాగా చిన్నారి మృతదేహాన్ని వెలికితీసే సమయంలో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

## మాతాశిశుమరణాల నివారణే లక్ష్యం



ఆసుపత్రిలోని స్కానింగ్ రికార్డులను పరిశీలిస్తున్న డిఎంహెచ్‌ఓ

మాతాశిశు మరణాల నివారణే లక్ష్యంగా వైద్య ఆరోగ్యశాఖ పనిచేస్తుందని, ఇందులో భాగంగానే మార్పు, రావమ్మా మహాలక్ష్మి, అమృతహస్తం అనే కార్యక్రమాలను ప్రభుత్వం రూపొందించిందని ప్రభుత్వ ఆశయం నెరవేరాలంటే ప్రభుత్వ వైద్యులు చిత్తశుద్ధితో పనిచేసి ప్రజలమన్ననలు అందుకోవాలని, అప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించగలమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి మాశిలామణి అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన గూడూరు ఐసీఎస్‌రోడ్డులోని ఓ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రి రికార్డులను, స్కానింగ్‌సెంటర్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఆడపిల్లల మరణాలు జిల్లాలో అధికంగా సంభవిస్తున్నాయని, కోనేటిమిట్టలో ఓ పసికందు మృతదేహం లభ్యం కావడం, అది పత్రికల్లో ప్రచురితంకావడంతో దానిపై విచారణ నిర్వహించేందుకు వచ్చినట్లు తెలిపారు. పట్టణంలోని పలుప్రైవేటు ఆసుపత్రులను తనిఖీ చేశామన్నారు. దీనిపై పోలీసుకేసు నమోదైందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే వైద్యులు సక్రమంగా విధులు నిర్వహించాలని, ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు తీసుకువెళ్లాలని, కాన్పులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. గూడూరులోని ప్రధాన ఆసుపత్రిలోని సీమాంక్‌సెంటర్‌కు అన్ని వసతులతో కూడిన వైద్యులను త్వరలో నియమించనున్నట్లు తెలిపారు.

## జనవిజ్ఞానవేదిక మానవహారం



గాంధీబొమ్మకూడలిలో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం స్థానిక బజారు వీధిలోని గాంధీబొమ్మ సెంటర్‌లో మహిళా కళాశాల విద్యార్థినులతో మానవహారం నిర్వహించారు. ఢిల్లీలో మహిళపై అత్యాచారం జరిపిన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దువ్వూరు మహిళా కళాశాల, కరుణామయి కళాశాల, లయోలా కళాశాల, మహిళా సంఘాలు పెద్దఎత్తున పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో వైద్యురాలు సి.రోహిణి, మున్సిపల్ కమీషనర్ జి.సుశీలమ్మ, వేదిక రాష్ట్ర సహాయ కార్యదర్శి చిత్తూరు అంజిరెడ్డి, వేదికజిల్లా కార్యదర్శి కె.ముక్తార్ అహ్మద్‌లు పాల్గొన్నారు.

## 'అమృతహస్తం' ప్రారంభం



గర్భిణీ స్త్రీలకు భోజనం వడ్డిస్తున్న బల్లి

గూడూరు డివిజన్‌లోని చిల్లకూరు మండలం కలువకొండ గ్రామంలో ఉన్న అంగనవాడీ కేంద్రంనందు గూడూరు ఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాదరావు మంగళవారం ఇందిరమ్మ అమృతహస్తం కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం బాలింతలు, గర్భవతులతో సహపంక్తి భోజనం చేశారు. కలువకొండ అంగనవాడీ కేంద్రానికి లక్షరూపాయలు ప్రహరీ గోడ నిర్మాణానికి తమ కోటాలో నుంచి నిధులను కేటాయిస్తున్నట్లు ఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్‌రావు అన్నారు. వంటగది నిర్మాణానికి సంబంధించి రాజీవ్ విద్యా మిషన్ ద్వారా మరో లక్ష రూపాయలు మంజూరుకు కృషిచేస్తామన్నారు.

## కిటకిటలాడిన దేవాలయాలు



ప్రత్యేక అలంకరణలో సంగమేశ్వరుడు

గూడూరు పట్టణంలోని దేవాలయాలన్నీ నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక వెంకటేశ్వరస్వామి దేవాలయం, చెన్నకేశ్వరస్వామి, అళగనాథస్వామి, సాయిబాబా ఆలయాలు మంగళవారం ఉదయం 5గంటల నుండి 12గంటల వరకు అందరు దేవతామూర్తులను ప్రత్యేకంగా అలంకరించి భక్తుల సందర్శనార్థం ఉంచారు.



లక్ష కుంకుమార్చన చేస్తున్న భక్తులు

PDF Compressor Free Version



# కల్యాణ వైభవం!



హలోహోం అప్లియన్సెస్ అధినేత, ఆమ(AMA) చంద్రశేఖర్‌రెడ్డిగా అందరికీ సుపరిచితుడైన యం.చంద్రశేఖర్‌రెడ్డి - ధనసేనల కుమారుడు శ్రీచరణ్ - అమృత (బెంగుళూరు వాస్తవ్యులు డి.వి.శ్రీరామరెడ్డి-సుగుణల కుమార్తె)ల కల్యాణం డిసెంబర్ 27వ తేదీ తిరుమలలోని శంఖుమిట్ట కల్యాణ ప్రాంగణంలో జరిగింది. నూతనవధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

## సిఎంఆర్ విజేతకు...
# కారును అందజేసిన ఆనం



విజేతలైన నాగరాజు దంపతులకు కారు తాళం అందజేస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

నెల్లూరు కనకమహల్ సెంటర్‌లోగల సిఎంఆర్ షాపింగ్‌మాల్‌లో డిసెంబర్ 30న విద్యానగర్‌కు చెందిన వి.నాగరాజు దంపతులు రాష్ట్ర ఆర్థికశాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి చేతుల మీదుగా హోండాయ్ ఇయాన్ కారును బంపర్ బహుమతిగా అందుకున్నారు. డిసెంబరు 26న సిసీసటి కామ్నాజెర్లలాని తీసిన బంపర్‌డ్రాలో నాగరాజు ఈ బహుమతిని గెలుచుకున్నారు. నగర శాసనసభ్యులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకుడు చేవూరు దేవకుమార్‌రెడ్డిలు అతిథులుగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వీక్లీ లక్కీడ్రా తీయగా ఎస్‌కె.సలీమ్ హీరో స్ప్లెండర్‌ను, డైలీ డ్రాలో ఎల్‌సిడీని ఓబులేశు, వాషింగమిషన్ పవన్‌కుమార్, మైక్రోఓవెన్‌ను ప్రవీణ్‌కుమార్, వెట్‌గ్రైండర్‌ను చారుహాసినిలు గెలుచుకున్నారని సిఎంఆర్ షాపింగ్‌మాల్ అధినేత మావూరి శ్రీనివాసరావు ప్రకటించారు. ప్రతి రోజూ ఐదు బహుమతులు, వారానికి ఓ హీరోస్ప్లెండర్, సంక్రాంతికి బంపర్‌డ్రాలో హోండాయ్‌ఇయాన్‌కారులు బహుమతులుగా అందజేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రాజీయాడ్స్ పెంచలయ్య, మేనేజర్ వాసు, షాపింగ్‌మాల్ సిబ్బంది పాల్గొన్నారు.

# వసతి గృహాలపై దృష్టిపెట్టండి




సమావేశంలో ప్రసంగిస్తున్న బి.ఉదయలక్ష్మి, కలెక్టర్ బి.శ్రీధర్, డిఆర్‌ఓ రామిరెడ్డి

ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో చదువుకొనే విద్యార్థులకు ప్రభుత్వం అందించే సదుపాయాలను సక్రమంగా అందించడంలో చిత్తశుద్ధితో పనిచేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ కమీషనర్ బి.ఉదయలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం నెల్లూరు డి.ఆర్.డి.ఎ సమావేశం హాలులో సహాయ సాంఘిక సంక్షేమ అధికారులు మరియు హాస్టల్ వార్డెన్లతో ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల నిర్వహణ కార్యక్రమాలపై జరిగిన సమీక్షాసమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రధానంగా ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి యస్.సి విద్యార్థుల విద్యాభివృద్ధి కొరకు నిర్దేశించిన కార్యక్రమాలను పూర్తిస్థాయిలో అందించేలా చర్యలు తీసుకోవాలని, ఈ ప్రక్రియలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. హాస్టల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకొని, వారికి నమ్మకం కలిగించేలా చూడాలన్నారు. ప్రభుత్వం అందించే మెను, మెస్ చార్జీలు సక్రమంగా అందించాలన్నారు.

జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్ మాట్లాడుతూ హాస్టల్ నిర్వహణలో సమర్థవంతంగా పనిచేసేందుకు జిల్లాస్థాయి అధికారులతో టాస్క్‌ఫోర్స్ కమిటీని నియమించి ఆయా మండలాలకు కేటాయించడం జరిగిందని, ఈ కమిటీ ఆయా మండలాలకు సంబంధించిన హాస్టల్స్‌ను సందర్శించి ప్రభుత్వం పిల్లలకు అందించే సేవా కార్యక్రమాలపై పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. అలాగే వారానికొకరోజు జిల్లాస్థాయిలో సంబంధిత అధికారులతో సమీక్షించడం జరుగుతుందన్నారు.




జిల్లా ప్రజలకు,
వై.యస్.ఆర్.కాంగ్రెస్‌పార్టీ నాయకులకు,
కార్యకర్తలకు, అభిమానులకు
2013 నూతన సంవత్సర
మరియు
సంక్రాంతి శుభాకాంక్షలు





బత్తిని విజయకుమార్
వై.యస్.ఆర్. కాంగ్రెస్ నాయకులు
గూడూరు



బత్తిని శ్రీహర్ష అనురాగ్‌కుమార్
గూడూరు





జననం - 01.07.1917 మరణం - 24.12.2012

## ఉత్తరక్రియలు

దాతృత్వానికి ప్రతిరూపం, మానవత్వానికి మరో రూపం
వ్యక్తిత్వంలో ఎవరెస్ట్ శిఖరం, మాన్యులు, మహనీయులు

**శ్రీ అల్లూరు ఆదిశేషారెడ్డి గారు**

తేది 24.12.2012న స్వర్గస్థులైనారు.

వారి పవిత్రాత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...

- కుటుంబసభ్యులు

ఉత్తరక్రియలు: తేది. 08.01.2013 మంగళవారం నిలుపు
తేది. 09.01.2013 బుధవారం ఎత్తురేవు, బ్రాహ్మణబియ్యాలు

గూడూరు నరసింగరావుపేటలోని మా స్వగృహములో జరుగును. కావున తెలియజేయడమైనది.

10.01.2013 గురువారం సా॥ 5.00గం.లకు గూడూరు డిఎస్ఆర్ కమ్యూనిటీ హాలునందు సంతాపసభ జరుగును.

# మహిళల రక్షణకీ 108 సేవలు

## రాష్ట్ర ప్రభుత్వ యోచన



గుళ్లలో, బళ్లలో, కార్యాలయాల్లో, బస్సుల్లో, రోడ్లలో, సినిమా హాళ్లలో, షాపింగ్‌మాల్స్‌లో... ఇలా ఒకచోట కాదు, అక్కడా ఇక్కడా అని తేడా లేకుండా మహిళలపై జరుగుతున్న అరాచకాలను, వేధింపులను అరికట్టడానికి అన్ని మార్గాలను అన్వేషిస్తోంది మన రాష్ట్ర ప్రభుత్వం. ఇందులో భాగంగా ఇప్పటికే అనేక అత్యవసర సర్వీసుల కోసం ప్రజలు వాడుకుంటున్న 108 నంబరును మహిళల సౌలభ్యం కోసం సైతం వినియోగంలోకి తేవాలని యోచిస్తోంది.

అత్యవసర వైద్యసేవలతో పాటు ఇతర అత్యవసర సేవల కోసం పోలీసు, అగ్నిమాపక శాఖలతో అనుసంధానమై వున్న '108' నంబరును మహిళలపై వేధింపులు జరిగే సమయంలో దయల్‌చేస్తే 108 సెంటర్ నుండి వెంటనే దగ్గరే వున్న పోలీస్‌స్టేషన్‌కి సమాచారమందించడమో లేక సమీపంలో వున్న 108 వాహనాన్ని ఫిర్యాదు అందిన ప్రాంతానికి పంపించడమో చేయడానికి వీలుగా మన ప్రభుత్వం చర్యలు చేపట్టబోతున్నట్లు సమాచారం. ఇటీవల ఢిల్లీలోనూ అనంతరం దేశంలోని పలు ప్రాంతాలలోనూ జరుగుతున్న వరుస ఘోర సంఘటనలకు మన రాష్ట్రంలో అడ్డుకట్టవేయాలనే ఆలోచన మన నేతలు దృఢంగా చేస్తున్నట్లున్నారు. అనేక ప్రాంతాలలో మహిళలు పోలీస్‌స్టేషన్‌లో మొరపెట్టుకున్నా స్పందన కనిపించడంలేదని ఆరోపణలు వస్తున్న తరుణంలో 108సెంటర్‌కి వచ్చే ప్రతి కాల్‌ని నమోదుచేసి వచ్చిన ఫిర్యాదుపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో తప్పనిసరిగా రికార్డు చేయాలి కాబట్టి బాధిత మహిళలకు వీలయినంత త్వరితగతిన సహాయం అందించడంతోపాటు వారి ఫిర్యాదుకు అథారిటీని కల్పించే అవకాశం 108తో కలుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

ఇప్పటికే అత్యవసర సేవల కోసం పోలీసుశాఖ ఆధ్వర్యంలో 1091నంబరు అందుబాటులో వున్నప్పటికీ ఈ నెంబరు పెద్దగా ప్రాచుర్యం లేకపోవడంతో కాల్స్ ఎక్కువగా రావడం లేదని, చాలా కార్యాలయాల్లోనూ కాలేజీల్లోనూ మహిళలు వేధింపులకు గురౌతూ కూడా చెప్పుకోవడానికి ముందుకు రావడం లేదని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం పలు కార్యాలయాల్లోనూ, కాలేజీల్లోనూ, హైస్కూళ్లలోనూ ప్రభుత్వమే కొంతమంది కౌన్సిలర్లను పంపించి మహిళలు ఎలాంటి భయం లేకుండా ముందుకు వచ్చి తమకు జరుగుతున్న అన్యాయాన్ని బయటపెట్టే విధంగా వారికి కౌన్సిలింగ్ ఇచ్చే ఏర్పాట్లను చేస్తోంది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే రాబోతున్నట్లు తెలుస్తోంది.

మొత్తానికి ఢిల్లీ ఘటనతో పాటు రాష్ట్రంలో జరుగుతున్న ఘోర సంఘటనలు మన నేతలను కొంచెం ఆలోచింపజేసినట్లు అనిపిస్తోంది. చెప్పిన మాటలు చెప్పినట్లుగా చేతల్లో చూపిస్తే ఫలితాలు బాగానే ఉంటాయి. చూడాలి మరి... వీరి చిత్తశుద్ధి.

# లగడపాటి... బాబు ముందు నువ్వేపాటి



నెల్లూరుజిల్లా తెలుగుదేశం కార్యాలయంలో డిసెంబరు 30న తెదేపా జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర పాత్రికేయుల సమావేశం నిర్వహించి కాంగ్రెస్ ఎంపి లగడపాటి రాజగోపాల్‌పై నిప్పులు చెరిగారు. వెనకటిరోజులు మరిచి చంద్రబాబును వెన్నుపోటుదారుడని విమర్శించడం తగదని, అధికారంలో వున్న తరుణంలో అదే చంద్రబాబునాయుడు ఇంటి ముందు వ్యాపార లావాదేవీల కోసం లగడపాటి పడిగాపులు కాసిన మాట మరిచిపోయాడా అని ఎద్దేవా చేశారు. దమ్ము, ధైర్యం వుంటే సోనియా, షిండేలను సమైక్యాంధ్రపై ప్రశ్నించాలని డిమాండ్ చేశారు. సొంతం రాష్ట్రంలో ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను పక్క రాష్ట్రాలకి అమ్ముకునే స్వార్థపరుడు లగడపాటి రాజగోపాల్ అని విమర్శించారు. సమావేశంలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ రామకృష్ణ, నాయకులు నూనె మల్లికార్జునయాదవ్, చేజర్ల వెంకటేశ్వరరెడ్డిలు పాల్గొన్నారు.






## ద్వితీయ వర్ధంతి



జననం : 07-07-1932 మరణం : 05-01-2011

పూజ్యులు, మా ఇంటిదైవం

మా పురోభివృద్ధికి ముఖ్యకారకులు, "మిత్రబంధు"

### శ్రీ నారపరెడ్డి కోదండరామరెడ్డి, M.A. గారు

(మైపాడు వాస్తవ్యులు)

స్వర్గస్తులై తేది 05-01-2013 నాటికి

రెండు సంవత్సరాలు నిండుతాయి.

ఆయన దివ్యస్మృతిని స్మరించుకుంటూ

వారి పవిత్రాత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...

**శ్రీమతి నారపరెడ్డి సులోచనమ్మ** - భార్య

| | |
|---|---|
| కుమారులు | - కోడళ్ళు |
| డాక్టర్. ఎన్.విష్ణుస్వరూప్‌రెడ్డి<br>ఇ.ఎన్.టి. & ఫేషియల్ ప్లాస్టిక్ సర్జన్,<br>కేర్ హాస్పిటల్, బంజారాహిల్స్, హైద్రాబాద్. | - డాక్టర్. శాంతి<br>ఒబేస్ట్రిషియన్ & గైనకాలజిస్ట్<br>అపోలో హాస్పిటల్, జూబ్లీహిల్స్, హైద్రాబాద్. |
| ఎన్.వినోద్‌రెడ్డి<br>ఛైర్మన్ & ఎం.డి., సిఆర్‌ఎంఐటి గ్రూప్, బెంగుళూరు. | - శాలిని<br>డైరెక్టర్, సిఆర్‌ఎంఐటి గ్రూప్, బెంగుళూరు. |
| కుమార్తెలు | - అల్లుళ్ళు |
| జి.సుప్రియ | - జి.విజయసింహారెడ్డి<br>డైరెక్టర్, ఫార్చ్యూన్ ఇండియా బిల్డర్స్, బెంగుళూరు. |
| ఎన్.పద్మప్రియ | - ఎన్.చంద్రారెడ్డి<br>ఛైర్మన్ & ఎం.డి., ఫార్చ్యూన్ ఇండియా బిల్డర్స్, బెంగుళూరు. |

మనుమలు, మనుమరాండ్రు

జి.అభిషేక్‌రెడ్డి, సిఆర్‌ఎంఐటి (డైరెక్టర్, ఆస్ట్రేలియా), వైష్ణవి, జి.అనుదీప్, రాహిల్, రుషిల్ సాకేత్, విషాల్, మేఘన, హర్ష, సంజన, వినూష

CRM IT NR Towers, BANGALORE.

Edited, Published, Printed & owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Executive Editor-G.SREENIVASULU REDDY.